MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 24 సంచిక: 1 రంగారెడ్డి సెప్టెంబర్ 2025 పేజీలు : 36 వెల : రూ. 10/-

## పి 4 ప్రారంభోత్సవం !





ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు, పాల్గొన్న ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ప్రభృతులు

## జాతీయ పురస్కారం!






ఉత్తమ నిర్వహణతో కేంద్రప్రభుత్వ 'ఆత్మ నిర్భర్ సంఘటన్' అవార్డు ను గెలుచుకున్న గంట్యాడ మండల సమాఖ్య

25 ఏపిమాస్ రజతోత్సవ సంవత్సరం!




ఎన్ ఎం డి సి - హైదరాబాద్ మారథాన్ నిర్వహణలో సహకరించిన ఏపిమాస్ బృందం




'మన డబ్బులు- మన లెక్కలు' యాప్‌ను ప్రారంభించిన కేంద్రగ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి శ్రీ అనిల్ కుమార్

నాబార్డ్ సౌజన్యంతో ....

NABARD

# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...

వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరువు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు

భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు-
కృంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు



## జీవనోపాధులపై....



పెరిగే వలసలు



రోగాలతో
పెరుగుతున్న ఖర్చులు



ఆహార
భద్రతకు ముప్పు



పోషకాహార
లోపాలు



తగ్గే ఉపాధి
అవకాశాలు



పంట నష్టాలతో
పెరిగే అప్పులు

NABARD

# మహిళా సాధికారత


సంపుటి 24 సంచిక 1



సంపాదకీయం

## వానలు !

ఎక్కడ విన్నా, చూసినా ఒకటే విశేషం! ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాదు, దేశ విదేశాలలోనూ చాలా చోట్ల యిదేతీరు. వానలు, వానలు ! రోజులు, వారాల తరబడి తెంపులేని వానలు. కొన్ని చోట్ల కుంభ వృష్టి ! అంతకు మించి మేఘ విస్ఫోటనం! రుతు పవనాలు అంతగా ప్రభావం చూపలేదనుకుంటే, అనుకోని అతిధుల్లా వచ్చే అల్ప పీడనాలు సృష్టిస్తున్న జలప్రళయం! అల్లకల్లోలం. జన జీవనం అస్తవ్యస్తం. ఇక పంటలు, రైతుల పరిస్థితి మరింత ఘోరం! చాలాచోట్ల నీటిచుక్క అరుదైన అమృత బిందువుగా మారిన దుస్థితి నెలకొన్న నేటి పరిస్థితులలో యింత భారీగా నీరు అందుబాటులోకి రావడం ఆహ్వానించదగిన, ఆనందదాయకమైన విశేషమే అయినా, ఊహించని రీతిలో విరుచుకుపడుతున్న వర్షబీభత్సం ఎన్నో సవాళ్ళను విసురుతున్నది. ముఖ్యంగా, వాతావరణానుకూల వ్యవసాయానికి అలవాటుపడిన మన రైతులకు పంటల సీజన్‌లో ఎదురైన ఈ విపత్కర పరిస్థితి చాలా యిబ్బందికరంగా తయారైంది. వేలాది ఎకరాలలో తాజాగా వేసిన పంటలు నీట మునిగి ఒకవైపు, కాపుకు వచ్చిన పంటలు చీడల, తెగుళ్ళబారినపడి మరోవైపు అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. ఇప్పటికే, పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధరలు లభించడంలేదని, కొత్తగా వేసే పంటలకు కావలసినంతగా ఎరువులు లభించడంలేదని కుమిలిపోతున్న రైతుల మీద ఈ ఊహించని జలప్రకోపం గోరుచుట్టు మీద రోకటిపోటులా మారింది. అసలే మార్కెట్‌లో కనీసపు గిట్టుబాటు ధరలు లభించడంలేదని కుంగిపోతున్న టమాటా రైతుకు కోతకు వచ్చిన పంటకు సోకిన మచ్చతెగులు  మరో విషాదాన్ని మిగుల్చుతున్నది. ఉల్లిరైతు పరిస్థితీ అంతే! భారీ వర్షాలకు ఉల్లిపాయలకు కుళ్ళుసోకే దుస్థితి ఒకవైపు, మహారాష్ట్రనుంచి కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న నాణ్యమైన ఉల్లిరకం తెచ్చిపెడుతున్న సవాలు మరోవైపు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. క్రిందటి ఏడాది మాహారాష్ట్రలో ఉల్లిపంట దెబ్బ తినడంతో మన తెలుగు రాష్ట్రాల ఉల్లిపాయలకు మంచి గిరాకీ ఏర్పడి, ఉల్లి రైతులు అధిక లాభాలు కళ్ళజూశారు. ఆ అనుభవంతో, ఈ ఏడాది మన రైతులు మరింత విస్తీర్ణంలో ఉల్లి సాగు చేశారు. కాని యిప్పుడు పరిస్థితి తారుమారైంది. మన పంట దెబ్బతిన్నది. మహారాష్ట్రలో పంట బాగున్నది. వ్యవసాయం జూదంగా మారడం అంటే యిదే కదా! ఈ ప్రకృతి వైపరీత్యంనుంచి, పరిస్థితి తారుమారు కావడం నుంచి మనం ఏవైనా పాఠాలు నేర్చుకోగలుగుతామా? మనం చేయగలిగింది ఏమీ లేదని మౌనంగా చేతులు ముడుచుకుని కూచోడం కాకుండా, కనీసం మనం చేయగలిగిన, నివారించగలిగిన మానవ కార్యాచరణ ఏదైనా వుంటుందా అని  ఆలోచించడం వివేకంకదా!  వాతావరణ శాస్త్రవేత్తల ముందస్తు అంచనాలు, వ్యవసాయ శాస్త్రవేత్తల, అధికారుల, రైతుల  సర్వసన్నద్ధత, ప్రభుత్వాల అప్రమత్తత యిన్నీ వున్నా నిస్సహాయంగా మిగిలిపోవలసి రావడం బాధాకరం. ఈ పరిణామం మనం మరింత  ముందుచూపుతో, యింటా బయటా వర్తనమాన స్థితిగతులపట్ల మరింత అవగాహనతో, ప్రత్యామ్నాయ ప్రణాళికల సంసిద్ధతతో మెలగవలసిన ఆవశ్యకతను గుర్తు చేస్తున్నది. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను ఎప్పటికప్పుడు చురుకుగా గమనించడం ఎంతో అవసరం. ఎక్కడో వాన పడితే, యింకెక్కడో జలుబు చేసినట్లు అమెరికా దుందుడుకుగా గుద్దులరిమితే, మన మామిడి, రొయ్యలు తదితర ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోయి ధర ధమాలుమన్నది. నిజమే, కొన్ని అనుభవంలోకి వస్తే కాని అర్ధంకావు.  ముందుగా ఊహించడం కష్టమే. కాని, ప్రపంచీకరణ, సమాచార విప్లవ సత్ఫలితాలతో పాటు, వాటి వల్ల కలిగే యిలాంటి దుష్ఫలితాలను కూడా మనం సాధ్యమైనంత ముందుగా అంచనా వేయగలగాలి. వాటిని సకాలంలో, చక్కగా ఎదుర్కోవడానికి తగిన వ్యూహ రచన చేయగలగాలి. ఇందుకు మరిన్ని నైపుణ్యాలు, సామర్ధ్యాలు, వినూత్న వ్యవహార శైలి అవసరమవుతాయి. వ్యక్తులు, వ్యవస్థలు, ప్రభుత్వాలు వాటిని సంతరించుకునే ప్రయత్నం చేయడమే దీనికి పరిష్కారం. ఆ దిశగా అందరం ఆలోచిద్దాం.



**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**

ఒకే పరిస్థితి మనోబలం క్షీణిస్తే సమస్యగా, స్థిరంగా వుంటే సవాలుగా, దృఢంగా వుంటే అవకాశంగా మారుతుంది

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి: **ఎన్ వినాయక రెడ్డి, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి , సాంకేతిక సహకారం : క్రిస్టొఫర్ వసంత్**

## లోపలి పేజీలలో ....

➪ చైతన్యాన్నిరగిల్చిన ఏపిమాస్ జాతీయసదస్సులు 05
➪ ఐదు దొంతర్ల సాగులో శిక్షణ 08
➪ తల్లిపాల ప్రాధాన్యంపై వ్యవస్థల రూపకల్పన! 09
➪ తల్లి పాలు ...తరగని ఆరోగ్య గనులు ! 11
➪ గంట్యాడ మండలసమాఖ్యకు జాతీయపురస్కారం12
➪ ఏపిమాస్ సి.ఇ.ఒ రాయలచెరువు సందర్శన 14
➪ గుర్రంకొండ ఎఫ్‌పిఒచే అల్లనేరేడు మార్కెటింగ్! 15
➪ హైదరాబాద్ మారథాన్‌లో ఏపిమాస్ సహకారం16
➪ గిన్నిస్ రికార్డ్ సాధించనున్న మహిళా శక్తి ! 17
➪ పిల్లలప్రపంచానికి రంగులద్దిన అంగన్వాడీటీచర్18
➪ ఆ అంగన్‌వాడీ ... మెరిసే తారా తోరణం! 19
➪ సొంత భూమి వున్న రైతులకు రూ. 50 వేలు 20
➪ 10శాతం పెట్టుబడి వుంటే మీరేపారిశ్రామికవేత్త 21
➪ విశాఖ ఉపాధ్యాయినికి జాతీయ అవార్డు 22
➪ తెలంగాణాలో అత్యధికంగా సైబర్ నేరాలు! 23
➪ స్త్రీధన్ పై హక్కు మహిళలకు మాత్రమే ! 24
➪ మెప్మా ద్వారా మహిళలకు రకరకాల ఉపాధులు 26
➪ పంట తెగుళ్ళ భరతంపట్టే ఈ-స్మార్ట్ రోబోలు 28
➪ భారతీయ సంస్థకు రామన్ మెగసెసే అవార్డు 29
➪ గుర్రాలపై కాపు కాస్తున్న మహిళా శక్తి ! 30
➪ స్వయం సహాయ సంఘాల్లో ఇక బాలికలు 32
➪ ప్రకృతిసేద్యం చేసే రైతులకు నెలకు రూ.5వేలు 33
➪ రాయితీపై వ్యవసాయ పరికరాలను పొందండి 34

### 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృ సంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతో పాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం 'మహిళా సాధికారత' పత్రికతో పాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

నేరుగా విజయం రాదు, వచ్చేవి అవకాశాలు, సాధ్యాసాధ్యాలు మాత్రమే ; వాటినే మనం విజయాలుగా మలచుకోవాలి

# చైతన్యాన్ని రగిల్చిన ఏపిమాస్ జాతీయ సదస్సులు !

– జి. శ్రీనివాస్

నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణమైన చక్కని పనితీరు కలిగిన స్వయంసహాయ సమాఖ్యలను గుర్తించి, ఇతర సమాఖ్యలలో స్ఫూర్తిని రగిల్చాలన్న సత్సంకల్పంతో ఏపిమాస్ గత ఐదేళ్ళుగా జాతీయ స్థాయిలో ఉత్తమ సమాఖ్యలకు పురస్కారాలను అందిస్తున్నది. ఈ అవార్డుల బహూకరణకు రెండు రోజులపాటు జాతీయ సదస్సులను కూడా ఏపిమాస్ నిర్వహిస్తున్నది. అయితే, ఈ జాతీయ సదస్సులు కేవలం అవార్డుల ప్రదాన వేదికలు మాత్రమే కాదు, ఇవి స్వయం సహాయ ఉద్యమం భవిష్యత్ చిత్రాన్ని రూపుదిద్దడంలో కీలకమైన పాత్ర పోషించాయి.

2021లో జరిగిన సదస్సు స్వయం సహాయక సంఘాల, సమాఖ్యల విజన్ 2030 రూపకల్పనకు దోహదంచేసింది. 2022లో మూడు దశాబ్దాల స్వయం సహాయ సంఘాల(ఎస్ హెచ్ జి) బ్యాంకు అనుసంధాన కార్యక్రమాన్ని సమీక్షించగా, 2023లో నిర్వహించిన సమ్మేళనం 'ఎస్ హెచ్ జిలు, ఎస్ హెచ్ జి ఫెడరేషన్ల మూడు దశాబ్దాల ప్రస్థానం సాధించిన ఫలాఫలితాలను' అంచనా వేసింది.

2024 సదస్సు "బిల్డింగ్ రెసిలియెంట్ అండ్ సస్టెయినబుల్ కలెక్టివ్ ఎంటర్‌ప్రైజెస్" అనే ఇతివృత్తంతో, వాతావరణ మార్పులు, ఎంటర్‌ప్రైజ్ ప్రోత్సాహం, వ్యవసాయ స్థితిస్థాపకత వంటి వర్ధమాన సవాళ్లకు అనుగుణంగా మహిళా సమూహాల కీలక పాత్రను నొక్కి చెప్పింది. ఈ సదస్సులలో నిర్వహించిన, ప్రధాన సమావేశాలు, సమాంతర చర్చాగోష్ఠులు ఎస్ హెచ్ జి ఉద్యమపు వివిధ కోణాలపై లోతైన చర్చలను ప్రోత్సహించాయి.

**ప్లీనరీ సెషన్‌లలో ప్రధాన చర్చనీయాంశాలు:**

- సక్సెస్‌ఫుల్ విమెన్ – లెడ్ మల్టీ – సర్వీస్ కలెక్టివ్స్ – వాయిసెస్ ఆఫ్ విమెన్ : వివిధ రాష్ట్రాల నుండి ఎస్ హెచ్ జి ఫెడరేషన్ల ప్రతినిధులు తమ విజయగాథలను, ప్రత్యేకతలను, అనుభవాలను పంచుకున్నారు. ఆరికాభి వృద్ధి, జీవనోపాధి కల్పన, సామాజిక మార్పులలో వారి కృషికి ఇది ఒక నిదర్శనం.
- రీ ఇమాజినింగ్ డిజైన్ ఆఫ్ ఎస్ హెచ్ జి ఫెడరేషన్స్: ప్రమోటింగ్ విమెన్ ఎంటర్‌ప్రైజెస్, అగ్రికల్చర్ వాల్యూ చైన్ డెవలప్‌మెంట్ ఆండ్ ఎఫ్‌పిఓస్: మహిళల నేతృత్వంలోని ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రోత్సహించడం, వ్యవసాయ విలువ గొలుసు అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పిఓలు) ఏర్పాటు పై దృష్టి సారించారు. దీని ద్వారా మహిళలు కేవలం ఉత్పత్తి దారులు గానే కాకుండా, ప్రాసెసింగ్, మార్కెటింగ్, వినియోగదారులకు ఉత్పత్తులను నేరుగా చేరువచేసే వ్యాపారాలలో కూడా పాలుపంచుకోవాలన్న చర్చ జరిగింది.
- ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్స్ యాజ్ ఎనేబ్లింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫర్ ఇంప్రూవ్‌డ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ టు మెంబర్స్ అండ్ ఫైనాన్షియల్ సస్టైనబిలిటీ : సభ్యులకు మెరుగైన ఆర్థిక సేవలు అందించడం, సమాఖ్యల సుస్థిర ఆరికాభివృద్ధిని నిర్ధారించడంపై చర్చ జరిగింది. సహకార బ్యాంకుల స్థాపన, చిన్న పొదుపులు, బీమా, గృహ నిర్మాణం, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడం వంటి అంశాలు చర్చించబడ్డాయి.

**సమాంతర గోష్ఠులు: లోతైన చర్చలు**

1. ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లు మహిళా యాజమాన్యంలోని ఎంటర్‌ప్రైజెస్‌కు బలమైన ఇంక్యుబేటర్‌లుగా , లైంగిక అడ్డంకులను తగ్గించడం ద్వారా యువ మహిళల నైపుణ్యం, ఉపాధిని సులభతరం చేయడం:

- ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లు బాహ్య మద్దతుపై ఆధార పడటాన్ని తగ్గించి, స్వీయ–నిర్వహణపై దృష్టి

సారించాలని నొక్కి చెప్పబడింది.

- గ్రూపులు బాహ్య రుణాలపై కాకుండా గ్రూపు పొదుపులపై ఆధారపడటాన్ని పెంచడానికి ప్రోత్సహించబడింది.
- ఎస్‌హెచ్‌జిలలో పురుషులు మహిళా సాధికారతకు మద్దతు ఇవ్వడం గుర్తించబడింది
- వ్యవసాయేతర కార్యకలాపాలలో వైవిధ్యం, ప్రత్యేకమైన ఉత్పత్తులను ప్రోత్సహించడం, మార్కెటింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు అవసరం అని గుర్తించారు

**2.** ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లు బలహీన వర్గాలలో మెరుగైన పోషకాహారం, ఆరోగ్యం కోసం స్థిరమైన వేదికలు:

- పిల్లలు , కౌమార బాలికలలో పోషకాహార లోపం రక్తహీనత వంటి సమస్యలపై దృష్టి సారించి, ఆహార వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని గుర్తించారు.
- ఎస్‌హెచ్‌జి సమావేశాలలో ఆరోగ్యం, పోషకాహారం, అంశాలపై క్రమం తప్పకుండా చర్చించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.
- ఎస్‌హెచ్‌జి, వాష్ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని, ముఖ్యంగా మారుమూల గ్రామాలలో శుభ్రమైన తాగునీరు, పారిశుధ్యం పరిశుభ్రతను ప్రోత్సహిస్తాయని గుర్తించారు.

**ఎస్‌హెచ్‌జి విజన్ 2030: ఎక్కడికి వెళ్తున్నాం?**

ఎస్‌హెచ్‌జి ఉద్యమం భవిష్యత్ దిశను నిర్దేశించడానికి, 2021లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ నాయకులు "ఎస్‌హెచ్‌జి విజన్ 2030"ని రూపొందించారు.

**దీని ప్రధాన లక్ష్యం:** "సమతుల లైంగికన్యాయం, సమాజంలో సంపద సృష్టి, ఇది మహిళల జీవన నాణ్యతను పెంచుతుంది. ఎస్‌హెచ్‌జిలు, వాటి ఫెడరేషన్లు స్వయం ప్రతిపత్తి గల, స్వతంత్ర, స్వయం సమృద్ధి గల, స్థిరమైన, స్థితిస్థాపక సంస్థలుగా అభివృద్ధి చెందాలి. ఇవి మహిళలు స్వయంగా, నిర్వహించేవి, మహిళల సామాజిక ఆర్థిక సాధికారత పూర్తి సామర్థ్యాన్ని గ్రహించడానికి ఒక బలమైన సహాయక పర్యావరణ వ్యవస్థ మద్దతుగా ఉండాలి" అనేది విజన్ 2030 అనేక కీలక ఆశయం.

1. సమానత్వం, సమ్మిళితత్వం (ఈక్వాలిటీ – ఇన్‌క్లూజన్)

- పితృస్వామ్య వ్యవస్థ నిర్మూలన, కుటుంబంలో, సమాజంలో అందరికీ సంపూర్ణ సమానత్వం.
- మహిళలకు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు. వారి హక్కులు, అర్హతలపై అధిక అవగాహన, అందుబాటును కల్పించడం,
- మహిళలపై అన్ని రకాల హింసను నివారించడానికి సంబంధిత సంస్థలతో (పోలీసు, మహిళా శిశు సంక్షేమం) కలిసి పనిచేయడం.

**2. సంస్థ నిర్మాణం**

- ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ కార్యకలాపాలలో మహిళలకు పూర్తి యాజమాన్యం. ప్రభుత్వం కేవలం సౌకర్యాల కల్పన నిధులను తక్కువ వడ్డీతో అందించడం మాత్రమే చేయాలి.
- ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ల కోసం ఒక ప్రత్యేక చట్టాన్ని రూపొందించడం. ఇది కార్యకలాపాల సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది.
- ఎస్‌హెచ్‌జిలు, ఎఫ్‌పిఓల కోసం ఒక నికార్సయిన రేటింగ్ ఏజెన్సీని స్థాపించడం.

**3. ఆరోగ్యం , పారిశుధ్యం**

పోషకాహారం, నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత, నాణ్యమైన ఆరోగ్య సేవలపై దృష్టి సారించి అందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించడం ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ లక్ష్యం.

- స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా గ్రామాలలో మంచి పారిశుధ్యాన్ని సులభతరం చేయడం.
- ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, అవసరమైన ఆరోగ్య సేవలను పొందడానికి సహాయపడటం.

**4. సామాజిక, రాజకీయ సాధికారత**

- గ్రామ పంచాయతీ సమావేశాలలో 80% మహిళలు పాల్గొనడం, ప్రతి పంచాయతీలో గ్రామ అభివృద్ధి ప్రణాళికలలో ఫెడరేషన్ సభ్యులు పాలుపంచుకోవడం.
- ప్రభుత్వ పథకాలు అందరికీ అందుబాటులో ఉండేలా, వేలాది మంది మహిళలకు ప్రయోజనం చేకూరేలా గ్రామ, బ్లాక్, జిల్లా స్థానిక సంస్థల ఎన్నికలలో ఫెడరేషన్ సభ్యులు పాల్గొనడం, గెలవడం.
- రాష్ట్ర , జాతీయ స్థాయి పాలక సంస్థలలో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే సభ్యుల ఆకాంక్షలను ప్రోత్సహించడం.

**ప్రధాన విధాన సిఫార్సులు**

జాతీయ సమావేశాలలో చర్చించబడిన అనేక విధాన సిఫార్సులు ఎస్‌హెచ్‌జి ఉద్యమదీర్ఘకాలిక సుస్థిరత్వానికి, ప్రభావం చూపడానికి మార్గాన్ని సుగమం చేస్తాయి:

**సంస్థాగత, ఆర్థిక సుస్థిరత్వం**

- ఎస్‌హెచ్‌జిల, ఫెడరేషన్ల సంస్థాగత అంశాలను బలోపేతం చేయడం, స్వయంప్రతిపత్తితో నిర్ణయ శక్తిని ప్రోత్సహించడం.
- ఆర్థిక స్థిరత్వం, సమ్మిళిత నాయకత్వం, భాగస్వామ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వడం.
- ఎస్‌హెచ్‌జిల స్థిరత్వం కోసం ఆదాయ విధానాన్ని ప్రోత్సహించడం,
- దీర్ఘకాలిక ఆచరణీయత కోసం ఆదాయ వనరులను వైవిధ్యపరచడం.

**సమాచార వ్యవస్థలు**

- ఎస్‌హెచ్‌జి కార్యకలాపాల సమర్థవంతమైన పర్యవేక్షణను సులభతరం చేయడానికి జాతీయ , వెబ్–ఆధారిత డేటాబేస్‌ను అభివృద్ధి చేయడం.
- ఎస్‌హెచ్‌జిలు, ఎఫ్‌పిఓల కోసం ఒక బలమైన మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్ (యం ఐ ఎస్ ), సిస్టమ్ రేటింగ్, గ్రేడింగ్‌ను అభివృద్ధి చేయడం.

**సామర్థ్య నిర్మాణం, మార్కెట్ అనుసంధానం**

- శిక్షణ, మార్కెటింగ్ మద్దతు, ఆడిట్ సేవలు, సాంకేతిక నైపుణ్యాలు, నిధుల సరైన వినియోగ ప్రయత్నాలను బలోపేతం చేయడం.
- ఎస్‌హెచ్‌జి ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ కోసం వివిధ ప్లాట్‌ఫారమ్‌లు, అవుట్‌లెట్‌లతో భాగస్వామ్యాలు

**లైంగిక న్యాయం, సామాజికాభివృద్ధి**

- లైంగిక న్యాయం, ఆర్థిక సాధికారత, సామాజికంగా ప్రభావవంతమైన కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడం.
- లైంగిక సమస్యలను పరిష్కరించడానికి జెండర్ రిసోర్స్ సెంటర్లను (జిఆర్‌సిలు) స్థాపించడం.

**ఎఫ్‌పిఓలకు ప్రోత్సాహం**

- అర్హత కలిగిన ఎఫ్‌పిఓలకు కనీస మద్దతు ధరతో (మినిమమ్ సపోర్ట్ ప్రైస్) వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ కేంద్రాలను పాక్స్‌లతో (ప్రైమరీ అగ్రికల్చరల్ కో–ఆపరేటివ్ సొసైటీలతో) సమానంగా కేటాయించాలని ఒత్తిడి తేవడం.
- ఎఫ్‌పిఓలకు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ప్రోత్సహించడం, వాటి రుణ అర్హతను మెరుగుపరచడం.

**అంతర్జాతీయ సహకార సంవత్సరం**

2025 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి "సహకార ఉద్యమ అంతర్జాతీయ సంవత్సరం (ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కో–ఆపరేటివ్స్ – ఐ వై సి2025)" గా ప్రకటించింది. 'సహకార సంస్థలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయి'(కో–ఆపరేటివ్స్ బిల్డ్ ఎ బెటర్ వరల్డ్) అనేది దీని ప్రధాన ఇతివృత్తం.

సహకార నమూనాతో అనేక ప్రపంచ సవాళ్లను ఎలా అధిగమించవచ్చో, 2030 నాటికి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను (సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ – ఎస్‌డిజిలు) అమలు చేయడంలో ఎలా కీలక పాత్ర పోషిస్తుందో ఈ సంవత్సరంలో హైలైట్ చేస్తారు.

ఈ నేపథ్యంలో సంవత్సరం పొడవునా ఏపిమాస్ అనేక కార్యకలాపాలను నిర్వహిస్తున్నది:

**1. ఎస్‌హెచ్‌జిలు, ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ల స్వయం ప్రతిపత్తి, స్వాతంత్ర్యం :** మహిళల స్వయం సమృద్ధి సంస్థలుగా ఎస్‌హెచ్‌జిలు, ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ల స్వయం ప్రతిపత్తిని, స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించడం.

**2. ఎఫ్‌పిఓల గుర్తింపు , మద్దతు :** ఎఫ్‌పిఓల కోసం సానుకూల విధాన వాతావరణాన్ని సృష్టించడానికి విధాన నిర్ణేతలు, వాటాదారులతో సహకరించడం. ఎఫ్‌పిఓలకు పన్నుల మినహాయింపులు, చట్టపరమైన సమ్మతి ప్రక్రియలను సరళీకరించాలని కోరడం.

**3. భవిష్యత్ సభ్యులను ప్రేరేపించడం:** ఇంటర్న్‌షిప్‌లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఐ ఇ సి (ఇన్‌ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్) సామగ్రి వంటి యువత ప్రోత్సాహక కార్యక్రమాలను అందించడం. ఐ ఆర్ యం ఎ, టి ఐ ఎస్ ఎస్, యం ఎ ఎన్ ఎ జి ఇ (మేనేజ్) వంటి ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో గ్రామీణ సమ్మిళిత కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్లను అందించడం ద్వారా యువతను ఎఫ్‌పిఓ రంగంలోకి ఆకర్షించడం. ■

## మరింత మేలైన ద్రవరూప నానో ఎరువులు

**వ్య**వసాయాన్ని సులభతరంగా, లాభసాటిగా మార్చ డానికి నూతన ఆవిష్కరణలు ఊతమిస్తున్నాయి. చిన్న గుళికల రూపంలో ఉండే యూరియా స్థానంలో ద్రవరూపం నానో యూరియాను అందుబాటులోకి వచ్చింది. డీఏపీ కూడా ఇలాగే లభిస్తోంది. మార్కెట్‌లో 45కిలోల యూరియా బస్తా రూ. 270 ఉంది. దానికి సమానమైన నానో యూరియా అర లీటరు డబ్బా ధర రూ.225 మాత్రమే. మొక్కలకు పిచికారి చేయడంతో ఎక్కువ ఫలితం ఉంటుం దని అధికారులు చెబుతున్నారు. గుళికల ఎరువులతో వృధా ఎక్కువ అవుతుంది. అయితే, దశాబ్దాలుగా బస్తాల కొద్దీ ఉపయోగించిన రైతన్నలు నానో యూరియాపై ఆసక్తి కన బర్చడం లేదని వ్యవసాయాధికారులు అంటున్నారు. ■

## ఐదు దొంతర్ల సాగులో శిక్షణ: ఏటా రూ.3 లక్షల నికరాదాయం

**సు**భాష్ పాలేకర్ కృషి (ఎస్‌పీకే) పద్ధతిలో అద్భుతమైన ఆవిష్కరణ ఐదు దొంతర్ల ఉద్యాన పంటల సాగు. ఈ సాగు చేపడితే వరి సాగులో రైతులు పొందే ఆదాయంతో పోల్చితే పది రెట్లు అధికాదాయం పొందవచ్చని సేవ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, ఎస్‌పీకే తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త శ్రీ విజయ్‌రామ్ తెలిపారు. భూతాపం పెరిగిపోతున్న దశలో వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను అధిగమించేందుకు ఎస్‌పీకే సేద్యం దోహద పడుతుందని అన్నారు. ఐదు అంచెల ఉద్యాన పంటల సాగు ద్వారా ఎకరానికి ఏడాదికి రూ. 3 లక్షల వరకు నికరాదాయం పొందే విధంగా కొత్తగా వ్యవసాయం చేపట్టాలనుకునే వారికి శిక్షణ ఇస్తామని ఆయన వివరించారు.

**సెప్టెంబర్ 2న పాలేకర్ ప్రసంగం**

హైదరాబాద్ దోమల్‌గూడ శ్రీరామచంద్ర మిషన్‌లో సెప్టెంబర్ 2 (మంగళవారం)న ఉదయం 9 గంటలకు జరిగే తెలుగు రాష్ట్రాల ఎస్‌పీకే ముఖ్యుల సమావేశంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఎస్‌పీకే రూపశిల్పి డా. సుభాష్ పాలేకర్ ప్రసంగిస్తారని శ్రీ విజయ్‌రామ్ తెలిపారు. ఎస్‌పీకే వ్యవసాయ పద్ధతిని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో అంకిత భావంతో పనిచేసే వారిని తెలుగు రాష్ట్రాల్లోని పాత జిల్లాల ప్రకారం జిల్లా సమన్వయకర్తలుగా నియమించ నున్నట్లు తెలిపారు. ఆసక్తిగల రైతులు, యువ రైతులు, విశ్రాంత ఉ ద్యోగులు అందరినీఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు.

**డిసెంబర్‌లో క్షేత్ర సందర్శన**

కృష్ణాజిల్లా గూడూరు మండలం తరకటూరు గ్రామంలో తాను పెంచిన ఐదు దొంతర్ల నమూనా క్షేత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 25నుంచి వచ్చే ఏడాది జనవరి 15వరకు నిర్దేశిత తేదీల్లో సందర్శించవచ్చని శ్రీ విజయ్‌రామ్ తెలిపారు. ఒక్కో రోజు ఒక్కో జిల్లాకు చెందిన వందమంది రైతులు సందర్శించ వచ్చన్నారు. వివరాలకు: ఫోన్: 6309111427 ■

ఆచరణ తగ్గి ఆకాంక్ష పెరిగితే అది తీరని ఆందోళన ; ఆకాంక్షను మించి ఆచరణ ముందడుగేస్తే అది విజయం

# తల్లిపాల ప్రాధాన్యంపై ప్రోత్సాహక వ్యవస్థల రూపకల్పన!

– భవాని, జాహ్నవి

ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7 వరకు ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవం ఘనంగా నిర్వహించబడుతుంది. శిశువుల ఆరోగ్యం, తల్లి సంక్షేమం, కుటుంబాల సుఖశాంతి కోసం తల్లిపాలు ఎంత ముఖ్యమో అందరికీ గుర్తు చేయడం ఈ వారోత్సవం ముఖ్య ఉద్దేశం. ఈ సంవత్సరం 'తల్లి పాలకు ప్రాధాన్యం – స్థిరమైన మద్దతు వ్యవస్థలను నిర్మిద్దాం' అనే కార్యాచరణ ప్రధానాంశంగా ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి.



గర్భధారణ ప్రారంభం నుండి ప్రసవం తర్వాతి కాలం వరకు తల్లిపాలను ఇవ్వడానికి తల్లులకు కావలసిన మానసిక, వైద్య, సామాజిక, పర్యావరణ ప్రోత్సాహక వ్యవస్థలను ఏర్పాటు చేయడం ఎంత అవసరమో ఈ అంశం ప్రత్యేకంగా తెలియజేస్తుంది.

**గోల్కొండ ఐసిడిఎస్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు**

ఏపిమాస్ పట్టణ పోషణ పథకం వారు, సమగ్ర శిశు సంక్షేమ శాఖ సహకారంతో, గోల్కొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గోల్కొండ, మల్లేపల్లి, కార్వాన్, ఆసిఫ్‌నగర్, జిర్రా సెక్టార్లలోని ఎంపిక చేసిన అంగన్వాడి కేంద్రాల్లో ఈ వారోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాల్లో గర్భధారణ చివరి త్రైమాసికంలోని గర్భిణులు, పాలిచ్చే తల్లులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీలు, అవగాహన సమావేశాలు, సలహాలు, ప్రశ్నోత్తర కార్యక్రమాలు, విడియో ప్రదర్శనలు, విజయగాథల వంటి విభిన్న పద్ధతుల్లో సందేశం అందించారు.

సమావేశాల్లో తల్లి ఆరోగ్యం, ప్రసవానికి ముందు, ప్రసవం తర్వాత సంరక్షణ, శిశువుకు తల్లిపాల ప్రాధాన్యం, మొదటి పాలు (ముర్రుపాలు) ప్రయోజనాలు వంటి అంశాలను విశదీకరించారు.

**తల్లిపాల ప్రయోజనాలు**

- శిశువుకు : రోగనిరోధక శక్తి పెరుగుతుంది, ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి, మానసిక – శారీరక అభివృద్ధి వేగవంతమవుతుంది.
- తల్లికి : ప్రసవం తర్వాత త్వరగా కోలుకోవడం, రక్తస్రావం తగ్గడం, కొన్ని రకాల కాన్సర్‌ల నుండి రక్షణ, కుటుంబ ప్రణాళికలో సహాయం.
- కుటుంబానికి : ఆరోగ్య ఖర్చులు తగ్గడం, తల్లిదండ్రుల పనిదిన నష్టాలు తగ్గడం.
- సమాజానికి : ఆరోగ్యవంతమైన భవిష్యత్ తరాలు,ఆర్థిక లాభాలు

**పర్యావరణ హితం**

తల్లిపాలు సహజసిద్ధం కావడంతో పర్యావరణానికి హితంగా ఉంటాయి. ప్రత్యామ్నాయ (ఫార్ములా) పాల ఉత్పత్తి, ప్యాకేజింగ్, రవాణా అవసరాలు తగ్గి, హానికరమైన ప్లాస్టిక్ వ్యర్థాలు, కార్బన్ ఉద్గారాల ముప్పు తగ్గుతుంది. ఇది పర్యావరణ పరిరక్షణలో ఒక సహజమైన, ఉచిత పరిష్కారం అని అవగాహన కల్పించారు.

**అపోహల నివృత్తి : నిజాలు వెలుగులోకి**

ఈ కార్యక్రమంలో కొన్ని సాధారణ అపోహలను తొలగించారు:

**అపోహ:** ఆపరేషన్ ప్రసవం తర్వాత శిశువుకు తల్లిపాలను ఆలస్యంగా ప్రారంభించాలి.

**వాస్తవం:** ప్రసవం అయిన మొదటి గంటలోపే తల్లి పాలను

ఇవ్వడం అవసరం, ఎంతో ప్రయోజనకరం.

**అపోహ :** తల్లి బలహీనంగా ఉంటే తల్లిపాలు శిశువుకు సరిపోవు.

**వాస్తవం:** తల్లి బలహీనంగా వున్నా, ఆమె శరీరం శిశువు కోసం తగినన్ని పాలు ఉత్పత్తి చేస్తుంది.

**అపోహ :** మొదటి పసుపు రంగు పాలు శిశువుకు హానికరం.

**వాస్తవం :** ఈ పాలు శిశువుకు అత్యంత రక్షణ కలిగించే 'సహజ సిద్ధమైన టీకా'.

**ప్రేరణాత్మక సంఘటనలు :** కార్యక్రమంలో రెండు విభిన్న సంఘటనలు ప్రత్యేకంగా చర్చించబడ్డాయి:

- ఒక తల్లి, ఆపరేషన్ అయినా కూడా, ప్రసవం జరిగిన గంటలోపే బిడ్డకు చక్కగా పాలివ్వగలిగింది.
- ఇంకొక తల్లి, తాను వెంటనే పాలివ్వలేనన్న అపోహతో ఐదురోజుల తర్వాత మాత్రమే పాలు ఇవ్వడం ప్రారంభించింది.

ఈ రెండు సంఘటనలు ఆపరేషన్‌కు, వెంటనే తల్లిపాలు యివ్వడానికి ఎలాంటి లంకె లేదని, ఆపరేషన్ ప్రసవంతర్వాత శిశువుకు వెంటనే తల్లిపాలివ్వకూడదన్నది కేవలం అపోహ మాత్రమే అనే వాస్తవాన్ని మరోమారు నిరూపించింది.

**తల్లుల అనుభవాలు–కథలతో స్ఫూర్తి :** కొంతమంది తల్లులు తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా, మిగతా తల్లులు ప్రేరణ పొందారు. ఉదాహరణకు, ఒక తల్లి తన శిశువు పుట్టినప్పటినుండి ఆరునెలలు పూర్తయ్యేవరకు పూర్తిగా తల్లి పాలనే ఇచ్చిన అనుభవాన్ని పంచుకుంది. దాంతో తన బిడ్డ ఆరోగ్యంగా, బలంగా పెరిగిందని గర్వంగా తెలిపింది.

**సారాంశం**

తల్లిపాలు కేవలం ఆహారం మాత్రమే కాదు. అవి శిశువు జీవనానికి పునాది. ఈ అవగాహనోత్సవం కేవలం ఏడురోజుల కార్యక్రమం కాకుండా, సంవత్సరం పొడవునా కొనసాగించాల్సిన ఆరోగ్య ఉద్యమం కావాలి. తల్లులు, కుటుంబాలు, ఆరోగ్య సిబ్బంది, సమాజం సమన్వయంతో పనిచేస్తే, భవిష్యత్ తరాలు మరింత ఆరోగ్యంగా, శక్తిమంతంగా రూపొందుతాయి.

## తల్లిపాలు ... జీవన నేస్తాలు !

– భవాని



*తల్లిపాలు ... పాలు మాత్రమే కావు ,*
*ప్రతి చుక్కలో ప్రాణం, ప్రేమ, బలం,*
*మనోబలం, సమస్తం ...!*
*పసివాని తొలి అశ్రువు తుడిచేది*
*తల్లి ఒడియిచ్చే మమకారపు మధుర స్పర్శ !*
*చిన్నారి పెదవులపై చెరగని ముద్రవేసే*
*మమతానురాగాల మాధుర్యపు తొలి ముద్దు !*
*కానీ ... ఈ మురిపాల వెల్లి*
*చేస్తుంది అప్పుడప్పుడూ లొల్లి*
*ఒక మూల అపోహలు అడ్డుగోడల్లా నిలుస్తాయ్*
*"పాలు సరిపోవు" అనే అనవసర భయం*
*"పాలివ్వడం తగదని" చెప్పే దుష్ట సలహా ...*
*సమాజపు మాటలు – కొన్నిసార్లు కత్తుల్లా గుచ్చుతాయి*
*కుటుంబం తోడ్పాటు లేకుంటే కమ్మేస్తుంది ఒంటరితనం*
*నిద్రలేని రాత్రులతో తల్లడిల్లుతుంది తల్లి హృదయం ....*
*అయితే ....*
*అండగా నిలిచే భర్త, ప్రోత్సహించే అమ్మ*
*అడ్డుచెప్పక ఆదరించే అత్త,*
*స్నేహితురాలు, పొదుపు సంఘం నేస్తం ...*
*తగ్గిస్తాయి ఆ భారాన్ని – అందిస్తాయి ధైర్యాన్ని!*
*తల్లిపాలు కేవలం ఆహారం కాదు సుమా!*
*అది పేగు బంధం ... ఆత్మీయానుబంధం,*
*బిడ్డకే కాదు, తల్లికి కూడా ఆరోగ్యానికి అది హామీ ...*
*అమ్మ పాలను మించి మరేముంటుంది అమృతం ?*
*అది అదృష్ట ఫలం ... చేజారితే దురదృష్టమే నిజం!!* ■

# తల్లి పాలు ... తరగని ఆరోగ్య గనులు,అరుదైన సిరులు !

*తల్లిపాలు తాగే శిశువులు తెలివిగా ఉంటారనీ సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతారనీ తెలిసిందే. కానీ మనకు తెలియని విశేషాలు ఇంకా ఎన్నో వున్నాయి. బిడ్డ బంగారు భవిష్యత్తుకు సాయపడే ఆ స్తన్యంలో సహజంగానే ఓ మ్యాజిక్ జరుగుతుందట! ఒక వెబ్ సైట్‌లో కనిపించిన ఆ విశేషాలు మహిళా సాధికారత పాఠకులకోసం ...*

తల్లి పాలు తెలివైనవి. ఆశ్చర్యపోకండి... వీటికీ రాత్రీ పగలూ తేడా తెలుసు మరి. జీవ గడియారాన్ని అనుసరిస్తూ... తల్లి ఉదయం ఇచ్చే పాలల్లో కన్నా రాత్రివేళ పాలల్లో మెలటోనిన్ ఎక్కువగా ఉంటుందట. పిల్లలు హాయిగా నిద్రపోయేందుకే ఈ ఏర్పాటు.

ఏ ఇద్దరి వేలి ముద్రలూ ఒకలా ఉండనట్లే అందరు తల్లుల పాలూ ఒకేలా ఉండవు. ఎవరికి వాళ్లకే ప్రత్యేకం. ఆ బిడ్డ అవసరాలకు తగ్గట్లుగా రూపొందుతాయి. వీటిల్లోని పోషకాలూ అన్నివేళలా ఒకేలా ఉండవు. పాపాయి ఆరోగ్యం, ఇచ్చే సమయాన్ని బట్టి ఆ పాలల్లోని బయోయాక్టివ్ పదార్థాలైన హార్మోన్లు, రోగనిరోధక కారకాలు మారుతుంటాయి. తల్లి ఆరోగ్యం, తీసుకునే ఆహార ప్రభావం కూడా వీటిమీద ఉంటుంది.

అమ్మ పాలు... ప్రొటీన్లు, కొవ్వులు, ఎంజైమ్‌లు, విటమిన్లు, ఖనిజాలు, ప్రోబయాటిక్స్... ఇలా వేలకొద్దీ పోషకాల సమాహారం. అందుకే ఆరునెలల వరకూ బిడ్డకు అవే సంపూర్ణాహారం. ఈ పాలల్లోని కొన్ని రకాల ఫ్యాట్స్ వల్ల అవి ఎక్కువగా తాగిన పిల్లల్లో కళ్లు మెరుగ్గా పని చేస్తాయనేది ఓ అధ్యయనం.

పాల ఉత్పత్తికి స్తన్యాల సైజుతో సంబంధం లేదు. పాపాయి ఎంత ఎక్కువగా పాలు తాగితే అంత ఎక్కువగా పాలు ఉత్పత్తి అవుతాయి. పాలు పడటం. క్షీర గ్రంథులమీద ఆధారపడి ఉంటుంది.

తల్లిపాలు గొప్ప ఔషధం. తొలిసారి ఇచ్చే పాలల్లో (కొలొస్ట్రమ్) యాంటీబాడీలు సమృద్ధిగా ఉంటాయి. అందుకే మదర్ మిల్క్ బేబీకి తొలి వ్యాక్సిన్. పాపాయికి ఏమాత్రం ఆరోగ్యం బాగోకున్నా వాళ్లను కాపాడుకోవడానికి ఆ పాలల్లో మరింత ఎక్కువ రోగనిరోధక కణాలు ఉత్పత్తవుతాయట. అంటే– తల్లి స్తన్యం కస్టమైజ్‌డ్ ఔషధమన్నమాట.

అమ్మ పాలల్లో 'హ్యూమన్ మిల్క్ ఆలిగోశాకరైడ్స్ (హెచ్ఎంఒ)' అనే ప్రత్యేక కార్బోహైడ్రేట్లు ఉంటాయి. స్తన్యాన్ని అద్భుతం అనడానికి ఇవే ప్రధాన కారణం. హానికర బ్యాక్టీరియాని నిరోధించి మేలు చేసే బ్యాక్టీరియాని పెంచుతాయివి. అలాగే వీటిల్లోని ఇమ్యునోగ్లోబ్యులిన్లు తరచూ ఇన్ఫెక్షన్లు రాకుండా బిడ్డ జీవితాంతం ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడతాయి.

బిడ్డకు తొలి రుచుల్ని పరిచయం చేసేదీ అమ్మ పాలే. తల్లి ఎంత ఆరోగ్యకరమైన ఆహారం తింటే, బేబీ అంత చక్కగా ఆస్వాదిస్తుంది. ఎక్కువ కూరగాయలూ పండ్లూ తింటే పాపాయి కూడా వాటిని ఇష్టపడుతుందనీ, ఈ అలవాటు జీవితాంతం ఉంటుందనీ 'ఇంటర్నేషనల్ మిల్క్ జీనోమిక్స్ కన్సార్టియం' తెలిపింది. అందుకే మరి... అమ్మలూ పాలిచ్చేటప్పుడు ఆహారంలో జాగ్రత్తలు పాటించాల్సిందే.

అమ్మ స్తన్యం ఎంత గొప్పదంటే... మగబిడ్డ కోసం 25 శాతం ప్రొటీన్లూ, కొవ్వులూ ఎక్కువగా ఉండేలా... అంటే– దాదాపు 200 క్యాలరీల శక్తి ఎక్కువున్న పాలను ఉత్పత్తి చేస్తుందట. ఆడబిడ్డ అయితే ఎక్కువ పరిమాణంలో పాలను ఉత్పత్తి చేస్తున్నట్లు కొన్ని అధ్యయనాల్లో తేలింది. ఇవన్నీ చూస్తుంటే... సృష్టి ధర్మం ఎంత గొప్పదో అనిపించట్లేదూ!

– డా. చీపురుపల్లి వసుంధర, సీనియర్ గైనకాలజిస్ట్

■

# గంట్యాడ మండల సమాఖ్యకు జాతీయ పురస్కారం!

– జి. శ్రీనివాస్

గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, స్వయం సహాయ సమాఖ్యల బలోపేతం విషయంలో ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా, గంట్యాడ మండల సమాఖ్య (సిఎల్ఎఫ్) మరో సారి తన ప్రతిభను జాతీయ స్థాయిలో నిరూపించింది. ఐదేళ్ళు గా ఏపిమాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఉత్తమ పనితీరు కలిగిన ఎస్ హెచ్ జి సమాఖ్యలకు జాతీయ పురస్కారాల' పోటీలో, ఈ సమాఖ్య 2022లో 3వ స్థానం, 2023లో 'పనితీరు మెరుగుదల – ప్రశంసా పత్రం' అందుకుంది. ఈ విజయపథాన్ని కొనసాగిస్తూ, 2025లో భారత ప్రభుత్వ యన్.ఆర్. యల్.యం (జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్) ప్రకటించిన ప్రతిష్మాత్మక జాతీయ "ఆత్మనిర్భర్ సంఘటన్ పురస్కారాన్ని" దక్షిణ భారత స్థాయిలో విజేతగా నిలిచి, మరోమారు తన సత్తా చాటింది.

> **జా**తీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (యన్.ఆర్. యల్.యం) ప్రకటించిన ప్రతిష్మాత్మక జాతీయ 'ఆత్మనిర్భర్ సంఘటన్ పురస్కారా'నికి దక్షిణ భారత స్థాయి విజేతగా నిలిచి, గంట్యాడ మండల సమాఖ్య జాతీయ స్థాయిలో తన సత్తా చాటింది.

**అవార్డు ప్రాముఖ్యత:** ఈ "ఆత్మ నిర్భర్ సంఘటన్ అవార్డు" కేవలం ఒక ట్రోఫీ లేదా గుర్తింపు కాదు. ఇది గ్రామీణ మహిళా సమాఖ్యల సామాజిక, ఆర్థిక, సంస్థాగత బలపేతం, ఆత్మనిర్భరత, సుస్థిరాభివృద్ధికి ప్రతీక. దక్షిణ భారతదేశంలోని అనేక సమాఖ్యలతో పోటీపడి ఈ విజయం సాధించడం గంట్యాడ సమాఖ్య సామర్థ్యాన్ని, విశిష్టతను నిరూపిస్తున్నది.

గంట్యాడ మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి కర్రి అనసూయ , కార్యదర్శి శ్రీమతి కంటిపాకు సీతమ్మ , సమాఖ్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి సులోచన, శ్రీ శ్రీనివాస్ ఢిల్లీలో కేంద్రమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

అవార్డు అందుకున్న అనంతరం వారు మాట్లాడుతూ, ఐదేళ్ళు పైబడిన కేటగిరీలో దేశవ్యాప్తంగా నాలుగు ప్రాంతాల నుండి 22 సి.యల్.యఫ్ / మండల సమాఖ్యలను తుది పోటీకి ఎంపిక కాగా, గంట్యాడ మండల సమాఖ్య ప్రథమ బహుమతి పొందటం ఎంతగానో సంతోషంగా ఉందనీ, సహకరించిన, ప్రోత్సహించిన సెర్ప్, ఏపిమాస్, యన్ఆర్‌యల్‌యం సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు.

**విజయాన్ని అందించిన ముఖ్యాంశాలు:**

**1. సంస్థల బలోపేతం, చక్కని సమన్వయం**

గంట్యాడ సమాఖ్య గ్రామస్థాయి నుండి మండలస్థాయి వరకు అన్ని స్థాయిలలోని సంస్థలను (సి బి ఓలు) బలోపేతం చేసింది. పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్ (పిఆర్ఐ)తో కలసి పనిచేసి పథకాల అమలు (యం జి ఎన్ ఆర్ ఇ జి ఎస్, జి పి డి పి), ఉపకమిటీల క్రియాశీల నిర్వహణ (పర్యవేక్షణ, బ్యాంకు లింకేజి, ఆర్థిక, ఆడిట్, జీవనోపాధి, సామాజిక ఆస్తుల తనిఖీ, కొనుగోలు మొదలైనవి) , చురుకైన పని సమాఖ్య విజయానికి ప్రధాన కారణం అయ్యాయి.

**2. జీవనోపాధి కార్యక్రమాలు**

గ్రామీణ మహిళలకు అదనపు ఆదాయం కల్పించడానికి గంట్యాడ సమాఖ్య అనేక జీవనోపాధి ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేసింది. ఇందులో టైలరింగ్ , బొటిక్ ఉత్పత్తులు, పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్, చిరుధాన్యాల పిండ్ల తయారీ, ఊరగాయలు, మసాలా పొడుల తయారీ, చేతిపనుల ఆధారిత చిన్న ఉత్పత్తులు ముఖ్యమైనవి. ఈ కార్యక్రమాల కోసం సమాఖ్య తరఫున శిక్షణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, ఉత్పత్తుల విక్రయానికి మార్కెటింగ్ అవకాశాలను కూడా

కల్పించింది. ఫలితంగా మహిళలకు అదనపు ఆదాయం లభించి, కుటుంబాల ఆర్థిక స్థితి మరింత మెరుగుపడింది.

**3. లైంగిక , మహిళా హక్కుల అవగాహన**

మహిళల హక్కులపై అవగాహన కల్పించడం, లింగ వివక్ష, గృహహింస వంటి సమస్యలపై ప్రత్యేక చర్యలు చేపట్టడం, బాలికల విద్య ప్రోత్సాహం, మహిళల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడం వంటి కార్యక్రమాలు సమాఖ్య ప్రత్యేకత.

**4. ఆరోగ్యం, పోషణ, 'వాష్' కార్యక్రమాలు**

తల్లులు, పిల్లలలో పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన, పరిశుభ్రత, శుద్ధజల వినియోగం, పారిశుధ్యం వంటి అంశాలపై సమాఖ్య ఎంతగానో శ్రద్ధ పెట్టింది. దీనివల్ల గ్రామీణ ఆరోగ్య పరిస్థితులు మెరుగయ్యాయి, రోగాల నివారణలో మంచి ఫలితాలు వచ్చాయి.

**5. ఆర్థిక క్రమశిక్షణ , పారదర్శకత**

గంట్యాడ సమాఖ్య 100% రుణ చెల్లింపులు సాధించి, దేశస్థాయిలో ఆదర్శంగా నిలిచింది. ఆదాయ–వ్యయాల నిర్వహణలో కేవలం 30% ఖర్చుల పరిమితితో ఆర్థిక సుస్థిరతను కాపాడుకుంది. నిధుల వినియోగంలో పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన సమాఖ్యకు విశ్వసనీయతను తెచ్చాయి.

**6. సంస్థ నిర్వహణ, నాయకత్వం**

సభ్యులందరిని నిర్ణయాల్లో భాగస్వామ్యం చేయడం, మహాసభ సమావేశాలు, బోర్డు సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించడం, నాయకత్వంలో చురుకుదనం, సమస్యల పరిష్కారంలో ముందుండటం గంట్యాడ సమాఖ్యను ఆదర్శంగా నిలిపింది. గంట్యాడ మండల సమాఖ్య సాధించిన ఈ అవార్డు ఇతర సమాఖ్యలకు ఒక ప్రేరణ కావాలి. గ్రామీణ మహిళలు సమైక్యంగా, క్రమశిక్షణతో, దూరదృష్టితో పనిచేస్తే ఏ స్థాయిలోనైనా ఎంతటి గుర్తింపు సాధించవచ్చో ఇది ఒక స్పష్టమైన ఉదాహరణ. ఏపిమాస్ మార్గదర్శకత్వం, సెర్ప్, యన్ ఆర్ యల్ యం గుర్తింపు, తోడ్పాటు ఈ విజయానికి బలమైన బాటలు వేశాయి. ■

## రైతులకు జండా పండుగ: ఎఫ్ పి ఓలు అందించిన ఫలం!

– వాసుదేవరెడ్డి



మర్యాదరామన్నపట్నం వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ బోర్డు డైరెక్టర్ ఒకరు మదనపల్లికి చెందిన సి.టి.ఎం నందలి ఇన్‌పుట్ షాపును 14.08.2025వ తేదీన సందర్శించారు. అప్పుడు జండాపండగజరుపుకుంటే బాగుంటుందన్న ఆలోచనను, సిబ్బందితో, తోటి డైరెక్టర్లతో పంచుకున్నారు. దానిని అందరూ ఆమోదించి, బాధ్యతలు పంచుకుని, జెండా పండుగకు సమాయత్తమైనారు. ఈ విషయం కొంతమంది స్థానిక రైతులకు తెలియజేశారు.

ఆగస్టు 15వతేది ఉదయం అందరూ గుమికూడి, మువ్వన్నెల జండాను సగర్వంగా ఎగురవేసి, జాతీయగీతాన్ని ఆలపించి, మిఠాయిలు పంచుకొని, 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. అనంతరం, అందరూ ఒక గంటసేపు కూర్చొని, 'జై జవాన్ – జైకిసాన్' నినాదం గురించి, నినాదం యిచ్చిన లాల్ బహుదూర్ శాస్త్రి గురించి, నాటి సందర్భం గురించి చర్చించుకున్నారు.

ఈ సందర్భంగా, ఒక డైరెక్టర్ మాట్లాడుతూ, యిప్పటి వరకు విద్యార్థులు, ఉద్యోగస్తులు, వ్యాపారులు, నాయకులు మాత్రమే జండా పండుగ చేసుకొనేవారని. ఎఫ్.పి.ఓ ల పుణ్యమా అని రైతులకు కూడా జండా పండుగ చేసుకొనే అవకాశం వచ్చిందని అనడం ఎంతో ఆహ్లాదాన్ని కలిగించింది. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహించుకోవాలనే నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.పి.ఓ డైరెక్టర్లు, రైతులు, ఎఫ్.పి.ఓ సిబ్బంది, ఆర్.డబ్ల్యు.ఐ సిబ్బంది, ఏపిమాస్ సిబ్బంది పాల్గొన్నారు. ■

ప్రతీకారం తీర్చుకుంటే నీకు హాని చేసినవారితో నీవూ సమానమే, మన్నించగలిగితే వారికంటె నీవు ఎంతో అధికం

# రాయలచెరువు ఎఫ్ పి ఓ ను సందర్శించిన శ్రీ సి ఎస్ రెడ్డి

– వాసు

ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.ఎస్ రెడ్డిగారు,ఆగష్టు 7–8 తేదీలలో తిరుపతి , అన్నమయ్య జిల్లాలలో పర్యటించారు. 7వ తేదీన, తిరుపతిజిల్లా, రామచంద్రాపురం మండలం లోని రాయలచెరువు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థను (ఎఫ్ పి ఓ) ప్రోగ్రాం మేనేజర్ శ్రీ వాసుదేవరెడ్డితో కలసి సందర్శించారు. ఈ ఎఫ్ పి ఓ 'నారి' అనే స్థానిక స్వచ్ఛంద సంస్థ సహకారంతో నడపబడుతున్నది. 'నారి' స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులైన శ్రీమతి రజని, శ్రీ మునిరత్నం, రాయలచెరువు ఎఫ్ పి ఓ పాలకవర్గ సభ్యులతో రామచంద్రాపురంలోని ఎఫ్ పి ఓ వ్యాపార కేంద్రంలో పరిచయ సమావేశం నిర్వహించారు. ఎఫ్ పి ఓ డైరెక్టర్లు ఉత్సాహంగా, వారు నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి తెలియజేశారు.

రాయలచెరువు ఎఫ్ పి ఓ ను 2021వ సంవత్సరంలో కంపెనీల చట్టం క్రింద రిజిస్టరు చేసున్నట్టు, ఇంతవరకు ఈ ఎఫ్ పి ఓలో 635 మంది వాటాదారులుగా వున్నారని, ఒక్కొక్కరి నుంచి 200 వంతున రూ.12,70,000 లు వాటాధనం సమీకరించినట్లు తెలియజేశారు. ప్రభుత్వం నుండి రూ.3,18,000 ల ఈక్విటీ గ్రాంటు లభించినట్లు తెలియజేశారు.

ఎఫ్ పి ఓ ద్వారా పశువుల దాణా, విక్రయ లైసెన్స్ అవసరం లేని ఇతర ఐటమ్స్‌ను అమ్ముతున్నట్లు చెప్పారు. సభ్యులకు ఇన్‌పుట్ సేవలను అందించడంలో భాగంగా, ప్రధాన వ్యాపార కేంద్రంతో పాటు మరో 3 ఇన్పుట్ వ్యాపార కేంద్రాలను బోర్డు ఆఫ్ డైరెక్టర్లే నిర్వహిస్తున్నట్లు తెలియ జేశారు. ఇంకా, ఎఫ్.పి.ఓ ద్వారా వేరుశనగ కోల్డ్ ప్రెస్ ఆయిల్ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఏ పి సి ఎన్ ఎఫ్ వారితో కలసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలియజేశారు. వ్యాపార అభివృద్ధికి నిధుల కొరత కొంత ఆటంకంగా వున్నట్టు చెప్పారు.

చర్చలలో గుర్తించిన అంశాలను దృష్టిలో వుంచుకొని, ఎఫ్ పి ఓ అభివృద్ధి కొరకు, ఎఫ్ పి ఓ బోర్డ్ ఆఫ్ డైరెక్టరు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ఏపిమాస్ సి ఇ ఓ ఈ క్రింది సూచనలను చేశారు.

- ఎఫ్ పి ఓ ఇంతవరకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లైసెన్సులను తీసుకోకపోవటాన్ని గుర్తించి, వెంటనే ఈ మూడు లైసెన్సులను తీసుకోవలసినదిగా సూచించారు.
- ఎఫ్ పి ఓ తన వ్యాపార అవసరాలకు బ్యాంకు నుండి ఋణం పొందవచ్చునని సూచించారు.
- ఎఫ్ పి ఓ మంచిగా సెకండరీ ప్రాసెస్ చేసి వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, ఓ ఎన్ డి సి లాంటి డిజిటల్ ఫ్లాట్ ఫారంల ద్వారా మార్కెట్ చేయక పోవడాన్ని గుర్తించి, ఆన్ లైన్ ప్లాట్ ఫారంలను ఉపయోగించుకొని, వ్యాపారాన్ని పెంచుకోవలసినదిగా చెప్పారు.
- ఎప్పటికప్పుడు ఎన్.పి.ఎం.ఎ ఎం.ఐ.ఎస్ పోర్టల్‌లో ఎఫ్ పి ఓ సమాచారాన్ని నింపవలసినదిగా సూచించారు.
- పుస్తక నిర్వహణలో సిబ్బందికి శిక్షణలు ఇప్పించి, పుస్తక నిర్వహణను మెరుగుపరచుకోవడం అవసరమని ఆయన పేర్కొన్నారు.

తదనంతరం, సి.కాలేపల్లి నందు ఎఫ్.పి.ఓ నిర్వహిస్తున్న సబ్ సెంటర్‌ను చూడడం జరిగింది. అక్కడవున్న స్టాకును పరిశీలించడం జరిగింది. బుక్ స్టాకుకు మరియు ఫిజికల్ స్టాక్‌కు సరిగా వున్నట్లు గుర్తించి, సెంటర్ను నిర్వహిస్తున్న డైరెక్టరును అభినందించడం జరిగింది. అందుబాటులో వున్న, ఎఫ్.పి.ఓ తయారు చేస్తున్న వేరుశనగ కోల్డ్‌ప్రెస్డ్ ఆయిల్ నాణ్యతను పరిశీలించడం జరిగింది. ■

ఆరడుగుల మనిషి విలువ నాలుగంగుళాల నాలుకపై ఆధారపడి వుంటుంది

# గుర్రంకొండ ఎఫ్ పి ఓచే అల్లనేరేడు అంతర్ రాష్ట్ర మార్కెటింగ్!

– డా. భార్గవి

**అ**న్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలంలోని తరిగొండ గ్రామానికి చెందిన శ్రీ అప్పిరెడ్డి, శ్రీ దొరస్వామి నాయుడు, శ్రీ సయ్యద్ నాయజ్ అలీ, శ్రీ రాజేష్ వారి మామిడి తోటలలో అల్ల నేరేడును (జామూన్)సాగు చేస్తున్నారు. నేరేడు ఆరోగ్య విలువలతో కూడిన సీజనల్ పండు. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్, ఫైబర్, ఐరన్, పొటాషియం వంటి పోషకాలు దీనిలో వుంటాయి.



మహారాష్ట్రలో మన అల్ల నేరేడు పండ్లకు మంచి డిమాండ్ ఉంది, నాణ్యత గల పండ్లకు మంచి ధర వస్తుంది. దీన్ని దృష్టిలో వుంచుకుని, గుర్రంకొండ ఎఫ్ పి ఓ నేరేడు పండ్లను నేరుగా మహారాష్ట్రలోని కొనుగోలుదారులకు సరఫరా చేసింది. గుర్రంకొండ ఎఫ్ పి ఓ రైతుల నుండి అల్ల నేరేడు పండ్లను నేరుగా సేకరించి, శుభ్రపరచి, గ్రేడింగ్, ప్యాకేజింగ్ చేసి, కొనుగోలుదారుల అవసరాలకు అనుగుణంగా బ్యాచింగ్ చేసింది.

పెద్ద సైజు, తీయని రుచి వల్ల ఈ పండ్లు మార్కెట్లో అధిక గిరాకీ కలిగి ఉంటాయి. గతంలో రైతులు ఎప్పుడూ అల్లనేరుదుని ప్యాకింగ్ లేకుండా, సాదా క్రేట్లలో స్థానిక మార్కెట్లో అమ్మేవారు. ఈ తరలింపు సమయంలో పండ్లు నలిగిపోవటం, చిట్లిపోవటం వల్ల నాణ్యత దెబ్బతిని, తక్కువ ధరే వచ్చేది.

ఈ సంవత్సరం (2025 లో) గుర్రంకొండ ఎఫ్ పి ఓ శుభ్రమైన పండ్లను పేపర్ ప్యాకింగ్ చేసి, నేరుగా మహారాష్ట్ర మార్కెట్‌కి పంపారు. మొత్తం 4,452 కిలోలు రైతులు దగ్గర నుంచి కొని, కొనుగోలుదారులకు పంపారు. ఈ వ్యాపారం వల్ల రూ.2,235/- లాభం వచ్చింది.

**రైతులకి మంచి ధర :** మార్కెట్లో రూ.40–45 కేజీ మధ్య ధర ఉంటే, ఎఫ్ పి ఓ ద్వారా అమ్మడం వల్ల రైతులకు రూ. 60–80 / కేజీ ధర లభించింది. సరైన డాక్యుమెంటేషన్ రికార్డు నిర్వహణ ద్వారా ఎఫ్ పి ఓ మీద రైతులకు నమ్మకం పెరిగింది.

**వ్యక్తిగతంగా రైతులు మార్కెటింగ్ చేస్తే ...**

- ♦ మద్దతు ధర లేకుండా, మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తుంది.
- ♦ అధిక రవాణా ఖర్చులు వ్యక్తిగతంగా భరించాలి.
- ♦ మార్కెట్ సమాచారం లేకపోవడం వల్ల తక్కువ ధరకు అమ్మాల్సి వస్తుంది.
- ♦ ధర నిర్ణయించే శక్తి (నెగోషియేషన్ పవర్) చాలా తక్కువగా ఉంటుంది.

**ఎఫ్ పి ఓ ద్వారా మార్కెటింగ్ వల్ల ...**

- ♦ రైతుల ఉత్పత్తిని సమిష్టిగా సేకరిస్తారు కాబట్టి , ఎక్కువ మొత్తంలో సరఫరా చేయవచ్చు.
- ♦ ప్యాకేజింగ్ వంటి విలువ పెంపు సేవలు చేస్తారు.
- ♦ నేరుగా కొనుగోలుదారులకు అమ్మే అవకాశం.
- ♦ మంచి ధర.
- ♦ రవాణా, నిల్వ, కూలీలు ఎఫ్.పి.ఓ ద్వారా సమిష్టిగా నిర్వహించవచ్చు
- ♦ రైతులకు లాభం పెరుగుతుంది, అవగాహన పెరుగుతుంది

| అంశం | రైతు | ఎఫ్‌పిఓ (రైతు సంస్థ) |
|---|---|---|
| ధర | తక్కువ (40–45/కేజీ) | ఎక్కువ (60–80/కేజీ) |
| మార్కెట్ | స్థానిక | నగరాలు, సంస్థలు |
| లాభం | తక్కువ | ఎక్కువ |
| వ్యవస్థ | అసంఘటిత | సంఘటిత |

■

పాత స్నేహం బంగారం , కొత్త స్నేహం వజ్రం ; కాని పాత స్నేహితులను మరువరాదు , వజ్రమైనా బంగారంలోనే పొదగాలి కదా!

# హైదరాబాద్ మారథాన్‌లో ఏపిమాస్ బృందం సహకారం!

– జి. శ్రీనివాస్

ప్రతి సంవత్సరం హైదరాబాద్ నగరంలో వేలాది మంది రన్నర్లతో అతి ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న 'ఎన్ ఎం డి సి – హైదరాబాద్ మారథాన్' ఈ సంవత్సరం కూడా (ఆగస్టు 24వ తేదీన) ఘనంగా జరిగింది. ఈ మారథాన్ నెక్లెస్ రోడ్ నుంచి ప్రారంభమై గచ్చిబౌలి స్టేడియం వరకు కొనసాగింది. రాష్ట్ర, దేశ నలుమూలల నుండి వచ్చిన రన్నర్లు, వివిధ వయసుల వారు, ఆరోగ్యం,





క్రీడాస్ఫూర్తి, సేవాస్ఫూర్తితో పాల్గొని, ఈ మారథాన్‌ను ఒక మహోత్సవంలా మార్చారు.

ఈ సందర్భంగా ఏపిమాస్ తరఫున 35 మంది వలంటీర్లు తమ సేవలను అందించారు. సంస్థ సి ఇ ఓ శ్రీ సి.యస్ రెడ్డి నాయకత్వంలో ఏపిమాస్ బృందం ఉదయం 4:45 గంటలకు కేబీఆర్ పార్క్ వద్దకు చేరుకుని, విధుల్లో నిమగ్నమయ్యారు.

ఏపిమాస్ బృందం ప్రధానంగా కేబీఆర్ పార్క్ గేట్ నం. 2, జూబ్లీ చెక్‌పోస్ట్ , ఎన్‌టిఆర్ భవన్ చౌరస్తా ప్రాంతాల్లో వలంటీర్ సేవలు అందించింది. వీటిని అత్యంత రద్దీ ప్రాంతాలుగా పరిగణిస్తారు. అందువల్ల ఏపిమాస్ వలంటీర్ల బాధ్యత మరింత ముఖ్యమైంది.

ఏపిమాస్ వలంటీర్లు రన్నర్లకు సరైన దిశలో కొన సాగేందుకు మార్గనిర్దేశం చేయడమే కాకుండా, ట్రాఫిక్ నియంత్రణలో ట్రాఫిక్ పోలీసులకు సమర్థంగా తోడ్పాటు అందించారు. రన్నర్ల ఉత్సాహాన్ని పెంచేందుకు చప్పట్లు కొడుతూ ప్రోత్సహించారు. అలసట చెందిన రన్నర్లకు అవసరమైనప్పుడు నీరు అందించడం, యితర ప్రాథమిక సహాయం చేయడం ద్వారా వారిని మళ్లీ ఉత్సాహపరిచారు.

ముఖ్యంగా మారథాన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యానికి చేరుకునేలా సహకరించడం వలంటీర్ల సేవలో ప్రధాన విశేషంగా నిలిచింది. వేలాది రన్నర్లు ఏపిమాస్ వలంటీర్లను ప్రోత్సాహంతో పరుగును మరింత ఉత్సాహంగా కొనసాగించారు. ఏపిమాస్ వలంటీర్ల చిరునవ్వు, సహనం, సమయపాలన, అంకితభావం మారథాన్‌లో ఒక ప్రత్యేక వాతావరణాన్ని సృష్టించాయి.

ఏపిమాస్ ఎల్లప్పుడూ సేవాస్ఫూర్తితో సమాజాభివృద్ధికి కట్టుబడి ఉంటుంది. హైదరాబాద్ మారథాన్ వంటి వేదికల్లో వలంటీర్లుగా పాల్గొంటుండడం ద్వారా, ఏపిమాస్ సమాజ సేవలో మరో ప్రత్యేక ముద్ర వేస్తున్నది. వలంటీర్లలో చాలా మంది యువత, మధ్యవయస్సు వారు, చిన్న పిల్లలు ఉండటం విశేషం. యువత, మధ్యవయస్సు వారు, చిన్న పిల్లలు ఈ తరహా సేవా కార్యక్రమాల్లో ముందుకు రావడం ద్వారా, సమాజంలో సేవాస్ఫూర్తి, క్రమశిక్షణ, బృంద భావన మరింత పెరుగుతాయి.

ఈ సందర్భంగా శ్రీ సి యస్.రెడ్డి మాట్లాడుతూ ఏపిమాస్ వలంటీర్లు మారథాన్‌లో చూపిన అంకితభావాన్ని అభినందించారు. సమాజానికి మేలు చేసే ప్రతి కార్యక్రమం లో పాల్గొనడం ద్వారా ఒక సంతృప్తి కలుగుతుందని, ఈ అనుభవం వలంటీర్లలో జీవితాంతం గుర్తుండే విలువలను నాటుతుందని, చెబుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొనాలని ఆశించారు. ఈ మారథాన్ ద్వారా ఏపిమాస్ వలంటీర్లు సమాజ సేవలో తమ అంకితభావాన్ని మరోసారి నిరూపించారు. ■

# గిన్నిస్ రికార్డ్ సాధించనున్న స్వయంసహాయ మహిళా శక్తి !

**డ్వాక్రా** సంఘాలు (స్వయం సహాయ మహిళా సంఘాలు) మహిళల ఆర్థిక ప్రగతికి నిచ్చెనలు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంఘాలు గిన్నిస్ రికార్డ్ నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నాయి. మార్చి 8న మహిళా దినోత్సవం రోజు కోటి రూపాయలు విలువైన పొదుపు సంఘాల వస్తువులను ఆన్‌లైన్‌లో ఒకేరోజు అమ్మి ప్రపంచ రికార్డు సృష్టించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. డ్వాక్రా మహిళల శక్తిని ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

రెండు దశాబ్దాల క్రితం అంకురించిన డ్వాక్రా సంఘాలు వేల కోట్ల రూపాయల కార్యకలాపాలు చేస్తూ దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. లక్షలాది మంది మహిళలు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు తీసుకుని వివిధ రకాల యూనిట్లు ఏర్పాటు చేసుకుని సమాజంలో గర్వించే స్థాయికి చేరారు. ప్రతిరోజూ వేల రూపాయల్లో లావాదేవీలు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ఈ కామర్స్ వేదికగా అమ్మకాలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో గిరాకీ విపరీతంగా పెరిగింది.

**రెండు దశాబ్దాల క్రితం అంకురించిన డ్వాక్రా సంఘాలు వేల కోట్ల రూపాయల కార్యకలాపాలు చేస్తూ దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. లక్షలాది మంది మహిళలు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు తీసుకుని వివిధ రకాల యూనిట్లు ఏర్పాటు చేసుకుని సమాజంలో గర్వించే స్థాయికి చేరారు.**

పొదుపు సంఘాలు సృజనాత్మకతతో తయారు చేసిన అలంకరణ సామగి, గృహోపకరణాలు, బుట్టలు, బొమ్మలు, గాజులు ఇలా ఆకర్షణీయమైన వస్తువులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. పొదుపు సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు నాణ్యంగా ఉండటం, తక్కువ ధరకే వస్తుండటంతో ఆన్‌లైన్‌లో పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు. మార్చి 8న మహిళాదినోత్సవం రోజున ఒకేరోజు కోటి రూపాయల విలువైన వస్తువులు అమ్మేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**దేశవ్యాప్త మార్కెట్ కోసం ...**

“డ్వాక్రా సంఘాల మహిళలు వివిధ రకాల వస్తువులు తయారు చేస్తున్నారు. సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే మేళాలకు విశేష ఆదరణ వస్తోంది. ఒకేచోట మేళాలు నిర్వహిస్తే కేవలం అక్కడే వస్తువులను కొనుగోలు చేస్తారు. అలా కాకుండా వీటిని ఆన్ లైన్‌లో ఉంచినట్లయితే దేశంలో ఎక్కడైనా కొనుగోలు చేయవచ్చు.

ఇందుకోసం ఈ కామర్స్ సంస్థలైన రెండు యాప్‌లతో అనుసంధానమయ్యాం. అందులో మా ఉత్పత్తులన్నీ ఉంటాయి. మార్చి 8న కోటి రూపాయల విలువైన వస్తువులు అమ్మేలా ప్రణాళికలు రూపొందించాం.”

**– *భరత్, మెప్మా డైరెక్టర్***

ఆన్ లైన్ ద్వారా జరిగే ఈ లావాదేవీలన్నింటినీ లెక్కించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. స్వయం సహాయ సంఘాల మహిళలు ఒకే రోజు కోటి రూపాయలు విలువైన వస్తువులను అమ్మిన రికార్డు ఇప్పటి వరకు ప్రపంచంలో ఎక్కడా లేదు. ఆ రికార్డును మెప్మా ద్వారా ఏపీలో నెలకొల్పాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది.

ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరిపి రికార్డు సృష్టించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతినిధులు మార్చి 8న రాష్ట్రానికి వచ్చి స్వయంగా పరిశీలించేందుకు అంగీకరించినట్లు మెప్మా డైరెక్టర్ తెలిపారు.

– ఈ టివి భారత్ సౌజన్యంతో

■

మనిషి స్వభావం మారడం కష్టం, మార్చాలనుకోవడం అవివేకం, అంతకంటె వారితో నీవు వ్యవహరించే తీరు మార్చుకో

# పిల్లల ప్రపంచానికి రంగులద్దిన అంగన్‌వాడీ టీచర్ !

– జాహ్నవి

**అ**ది 2001 వ సంవత్సరం. కార్వాన్ సెక్టార్‌లోని సాయినగర్–2 బస్తీలో కొత్త అంగన్వాడీ సెంటర్ ఏర్పాటైంది. ఆ సెంటర్‌కి టీచర్‌గా నియమితులైన జయలత గారు, అప్పటినుంచే ఈ పని కేవలం వేతనంకోసం చేసే ఉద్యోగం కాదని, పిల్లల భవిష్యత్తును మలచే పవిత్రమైన సేవ అని నిర్ణయించుకున్నారు. ఈ 24 ఏళ్ల ప్రయాణంలో ఆమె తన అంకితభావం, సహనం, సృజనాత్మకతతో ఎందరో చిన్నారుల జీవితాలను ప్రభావితం చేశారు.



**సృజనాత్మక పాఠ్య పద్ధతులు**

జయలత గారి బోధనలో పుస్తకాలు మాత్రమే కాదు, కళ, ఆట, ఊహాశక్తి ప్రధాన పాత్ర పోషిస్తాయి. అందు బాటులో ఉన్న కాగితాలు, గుడ్డ ముక్కలు, గుడ్డు ట్రేలు, మట్టి, పాత బాటిల్స్ వంటి వస్తువులను ఉపయోగించి పిల్లలకు రంగులు, ఆకారాలు, బొమ్మలు, క్రాఫ్ట్ సామగ్రి తయారు చేస్తారు. ఇది పిల్లల్లో సృజనాత్మకతను పెంచడమే కాకుండా, పునర్వినియోగం విలువను కూడా నేర్పుతుంది.

సెంటర్‌లోని గోడలు రంగురంగుల పోస్టర్లు, పిల్లల చేతులతో చేసిన చిత్రాలు, చిన్న క్రాఫ్ట్ వస్తువులతో ఎల్లప్పుడూ కళకళలాడుతూ ఉంటాయి.

ప్రతి రోజు కొత్త అలంకరణ, కొత్త ఆట, కొత్త కథ – పిల్లలు ఎప్పుడూ బోర్ అవ్వకుండా, నేర్చుకోవడంపై ఆసక్తి పెంచేలా ఉంటాయి.

**పిల్లలతో పాటు తల్లుల శ్రేయస్సు**

ప్రతిరోజూ సుమారు 20 మంది చిన్నారులు సెంటర్‌కి హాజరవుతారు. అదేవిధంగా 10–15 మంది గర్భిణులు, పాలిచ్చే తల్లులు కూడా ఈ సెంటర్‌పై ఆధారపడుతున్నారు. వీరికి పౌష్టికాహారం అందించడంతో పాటు, మాతాశిశు ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యత, శిశు సంరక్షణ, టీకాల ఆవశ్యకత వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పిస్తారు.

తల్లులు ఎదుర్కొనే సమస్యలను జయలత ఓపికగా విని, సరైన సలహాలు ఇస్తారు. అనేక సందర్భాల్లో, ఒక తల్లి మానసికంగా ధైర్యం కోల్పోయినప్పుడు, జయలత గారి మాటలే వారికి మళ్లీ ధైర్యం ఇచ్చాయి.

**పండుగల సందడి – ఆనందం, విలువల పాఠం**

జయలత గారి సెంటర్‌లో పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కావు. అవి సామాజిక విలువలు, స్నేహభావం, సంప్రదాయాల పరిచయం కోసం ఒక వేదికగా మారతాయి.

- ♦ హోలీ సందర్భంగా సహజ రంగులతో ఆటలు ఆడి, పర్యావరణ పరిరక్షణ గురించి చెప్పడం
- ♦ స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాక ఆవిష్కరణ, దేశభక్తి పాటలు పాడించడం
- ♦ రాఖీ పండుగలో పరస్పరం రాఖీ కట్టుకోవడం ద్వారా స్నేహభావం పెంపొందించడం
- ♦ కృష్ణాష్టమి రోజున పిల్లలు చిన్న కృష్ణుడు, రాధ వేషధారణలతో నృత్యాలు చేయడం

ఈ వేడుకలు పిల్లల్లో సాంస్కృతిక అవగాహనతో పాటు సమాజంలో కలిసిమెలిసి ఉండే గుణాన్ని పెంపొందిస్తాయి.

**ఆదర్శ అంగన్వాడీగా గుర్తింపు**

జయలత గారి కృషి ఫలితంగా సాయినగర్–2 అంగన్వాడీ కేంద్రం ఒక ఆదర్శ సెంటర్‌గా గుర్తింపు

(మిగతా 20వ పేజీలో)

మంచితనం అంటే అందరినీ సంతోషపెట్టడం అనికాదు, అది అసాధ్యం; ఎవరినీ నొప్పించకుండా వుండడమే మంచితనం

# ఆ అంగన్‌వాడీ ... మెరిసే తారా తోరణం!

– భవాని

గోల్కొండ ఐసిడీఎస్ ప్రాజెక్ట్‌లోని జియాగూడా సెక్టర్‌కు చెందిన కేశవస్వామి నగర్–1అంగన్వాడీ కేంద్రం ఇప్పుడు తల్లిదండ్రుల ప్రశంసలతో మెరిసిపోతోంది. ఈ మార్పుకు ప్రధాన కారణం 31 ఏళ్ల అంగన్వాడీ టీచర్ కల్పన!

**అంకితభావంతో నిండిన ప్రయాణం**

10వ తరగతి పూర్తి చేసి, కేవలం 18 ఏళ్ల వయసులోనే అంగన్వాడీ టీచర్‌గా చేరిన కల్పన, ఇప్పటివరకు 12 సంవత్సరాలకు పైగా తన జీవితంలో ఎక్కువ భాగాన్ని చిన్నారుల అభివృద్ధికే అంకితం చేసింది. ఆమెతో పాటు ఎప్పుడూ ఆమెకు తోడుగా నిలిచే సహాయకురాలు జ్యోతికూడా ఈ విజయానికి మరో కీలకం.

చాలామంది ఇప్పటికీ "అంగన్వాడీ అంటే బాలామృతం ఇచ్చే స్థలం మాత్రమే" అని భావించే అపోహతో ఉంటారు. కానీ కల్పన మాత్రం, "ఈ వయసులో పిల్లలకు సరైన మార్గదర్శనం, ఉత్సాహంగా నేర్పడం అత్యంత ముఖ్యం" అని నమ్మింది. ప్రైవేట్ పాఠశాలల్లో ఆకర్షణీయమైన ప్రీ–ప్రైమరీ తరగతులు ఉన్నప్పటికీ, వాటి అధిక ఫీజులు మధ్య తరగతి కుటుంబాలకు భారమవుతాయి. అందుకే, ఆమె "మంచి పాఠశాల స్థాయి బోధనను ఆంగన్‌వాడీలోనే అందించాలి" అని సంకల్పించుకున్నది.

**సృజనాత్మక బోధన పద్ధతులు**

ప్రస్తుతం ఈ సెంటర్‌లో 22 మంది పిల్లలు ప్రీ–స్కూల్ విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ కేవలం పుస్తకాలలోని పాఠాలే కాకుండా, ఆటలు, పాటలు, కథలు, చిత్రలేఖనం వంటి రకాల మార్గాల ద్వారా బోధన సాగుతుంది. పిల్లల్లో ఉత్సాహం పెంచడానికి కల్పన రూపొందించిన ఫోటో స్టార్ చార్ట్ ప్రత్యేక ఆకర్షణ. ప్రతి పిల్లవాడి ఫోటో పక్కన మంచి ప్రవర్తన లేదా మంచి పనికి 'మెరిసే తార' స్టిక్కర్ పెడుతుంది. ఈ తారలు చూసి పిల్లలు ఆనందంతో మెరిసిపోతారు, తల్లి దండ్రులు గర్వపడతారు. ఆ చార్ట్ సెంటర్ గోడపై అందంగా వెలుగుతూ అందరినీ ఆకర్షిస్తుంది.



**చిన్నారుల గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్!**

ప్రీ–స్కూల్ పూర్తి చేసి మొదటి తరగతిలో అడుగుపెట్టే పిల్లల కోసం కల్పన 'గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్' ప్రారంభించింది. ఆ రోజు పిల్లలు చిన్న గ్రాడ్యుయేషన్ టోపీలు, అందమైన దుస్తులు ధరించి, సర్టిఫికేట్‌లను అందుకుంటారు.

తల్లిదండ్రులు ఆ చిరునవ్వుల క్షణాలను ఫోటోల్లో బంధించుకుంటారు. ఈ వేడుక పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని, పెంపొందిస్తే, తల్లిదండ్రుల హృదయాల్లో సంతోషం, సంతృప్తి నింపుతుంది.

**తల్లిదండ్రులలో అవగాహన పెంపు**

పోషకాహారంకోసం వచ్చే తల్లిదండ్రులతో కల్పన చర్చిస్తూ, పిల్లలు మూడు సంవత్సరాలు పూర్తి చేసిన వెంటనే ఆంగన్‌వాడీలో చేర్పించాలని ప్రోత్సహిస్తుంది.

ఈ కృషి ఫలితంగా, ఇప్పుడు చాలామంది తల్లిదండ్రులు స్వయంగా వచ్చి – "మా పిల్లలను ఎప్పుడు చేర్పొచ్చు?" అని అడుగుతున్నారు. ఇది కల్పన తీసుకొచ్చిన మార్పుకు స్పష్టమైన సాక్ష్యం.

**కట్టుబాటు ముఖ్యం**

సహాయకురాలు జ్యోతితో కలిసి, ప్రేమ, శ్రద్ధ, సృజనాత్మకతతో బోధిస్తూ, "నాణ్యమైన చదువు అంటే పెద్ద ఫీజులు కాదు, నిజమైన శ్రద్ధ, కట్టుబాటు" అని కల్పన నిరూపిస్తోంది. ఆమె ప్రేరణతో, ఒక్కో చిన్న తారలా పిల్లల భవిష్యత్తు వెలుగులు విరజిమ్ముతోంది. ■

ఆశ లేని చోట ఆందోళనే లేదు, అంతా ప్రశాంతమే !

# సొంత భూమి వున్న రైతులకు రూ. 50 వేలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఆర్థిక బలోపేతం కోసం ఆకర్షణీయమైన సబ్సిడీ పథకాలను అందిస్తున్నాయి. కూరగాయలు, పండ్లు, పూల సాగును ప్రోత్సహించే ఈ పథకాలు రైతులకు అధిక లాభాలు సంపాదించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. సొంత భూమి ఉన్నవారు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చు.

నేషనల్ హార్టికల్చర్ బోర్డు (ఎన్‌హెచ్‌బి)ద్వారా అందు బాటులో ఉన్న సబ్సిడీలు రైతులకు వరదానం లాంటివి. ఉదాహరణకు, రక్షిత సాగు కింద గ్రీన్‌హౌస్, నెట్ హౌస్ వంటి ఆధునిక సౌకర్యాలతో టమాట, క్యాప్సికం, గులాబీ, ఆర్కిడ్ వంటి పంటల సాగుకు రూ.1.12 కోట్ల వరకు నిధులు మంజూరవుతాయి. ఇందులో 50 శాతం సబ్సిడీగా లభిస్తుంది. ఈ నిధులతో పక్షులు, వడగళ్ల నుంచి పంటలను కాపాడే నెట్స్, నీటిపారుదల వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవచ్చు. అలాగే, మామిడి, నిమ్మ, అరటి వంటి పండ్లతోటలకు ఐదు ఎకరాలకు రూ.75లక్షల వరకు, అందులో 40 శాతం సబ్సిడీ గా అందుతుంది. ఈ డబ్బును బిందు సేద్యం, యంత్రాల కొనుగోలు, పంట ప్యాకింగ్ యూనిట్లకు ఉపయోగించవచ్చు.

పంట నిల్వ కోసం కోల్డ్ స్టోరేజీలు, ప్యాక్‌హౌస్‌ల నిర్మాణానికి కూడా ఆర్థిక సహాయం అందుతోంది. రూ.1.45 కోట్ల వరకు నిధులతో 30 శాతం సబ్సిడీ లభిస్తుంది. అదేవిధంగా, ఆయిల్ పామ్ సాగుకు ప్రత్యేక పథకం కింద ఒక హెక్టారుకు 143 మొక్కలను ఉచితంగా అందిస్తారు. మొదటి నాలుగేళ్లు అంతర పంటలకు ఏడాదికి రూ.5,250 చొప్పున సబ్సిడీ ఉంటుంది. చిన్న రైతులకు 20 గుంటలలో తీగజాతి కూరగాయలకు పందిరి సాగుకు రూ.50 వేల వరకు సహాయం అందుతుంది.

దరఖాస్తు ప్రక్రియ సులభం. ఎన్‌హెచ్‌బి వెబ్‌సైట్ (www.nhb.gov.in)ద్వారా ఆధార్, పాన్‌కార్డు, భూమి పత్రాలతో ఆన్‌లైన్‌లో అప్లయ్ చేయవచ్చు. బ్యాంకునుంచి రుణ సంసిద్ధత లేఖ తీసుకోవడం, సమగ్ర ప్రాజెక్టు నివేదిక సమర్పించడం అవసరం. హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్‌బి కార్యాలయంలో వివరాలు తెలుసుకోవచ్చు. ఈ పథకాల గురించి గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ■

## రంగులద్దిన అంగన్వాడీ టీచర్ !

(18 వ పేజీ తరువాయి)

పొందింది. పిల్లల హాజరు ఎల్లప్పుడూ అధికంగా ఉండటం, తల్లిదండ్రులు సెంటర్‌పై నమ్మకం ఉంచడం, శుభ్రత, అలంకరణ, బోధన పద్ధతులు ఇతర సెంటర్లకు ఆదర్శంగా నిలవడం – ఇవన్నీ ఆమె సేవకు ప్రత్యక్ష సాక్ష్యాలు.

అంగన్‌వాడీ టీచర్ మాటల్లో చెప్పాలంటే ...‘ బృందం, ఆరోగ్య కార్యకర్త భాగ్య మా బస్తీలో ఎంతో ముఖ్యమైన సహకారం అందించారు. వారు ప్రతి రోజూ ఇంటింటికీ వెళ్ళి, తల్లులతో మాట్లాడి, ఆరోగ్యంపైన, పోషణపై అవగాహన కల్పించారు. దీనివల్ల తల్లుల ఆలోచనల్లో, అలవాట్లలో క్రమంగా మార్పువచ్చింది. పిల్లల కోసం ఆంగన్ వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని వినియోగించు కోవాలని, పిల్లలను పాఠశాలకు పంపాలని వారు నిరంతరం ప్రోత్సహించేవారు.

ఈ ప్రయత్నాల ఫలితంగా తల్లులు మాత్రమే కాకుండా, సమాజం మొత్తం ఒక ముఖ్యమైన విషయం గ్రహించింది. అంగన్‌వాడీ టీచర్ మాత్రమే కాకుండా, ఇతర స్వచ్ఛంద సంస్థ సభ్యులు కూడా మన ఆరోగ్యం, మన పిల్లల భవిష్యత్తు కోసం శ్రద్ధతో కృషి చేస్తున్నారు అని. ఈ అనుభవం బస్తీ వాసుల్లో నమ్మకం పెంచి, వారు కూడా ఈ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేలా చేసింది” అని అంగన్‌వాడీ టీచర్ వివరించారు. తన ప్రయాణంలో ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందించిన ప్రాజెక్ట్ అధికారిణి శ్రీమతి రేణుక, సూపర్వైజర్ హేమలత గారికి జయలత హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతోంది. ■

# 10శాతం పెట్టుబడి వుంటే ... మీరే పారిశ్రామిక వేత్త!

**మీరు** పారిశ్రామికవేత్త కావాలనుకుంటున్నారా? పచ్చళ్లు చేయండి, పిండి మరలు పెట్టుకోండి, పసుపు కొమ్ములు, మిరప పొడులుగా కొట్టండి, పప్పుల మిల్లులూ పెట్టుకోండి, మినీ రైస్‌మిల్, ఆక్వా ఆధారిత ఉత్పత్తులు, పశువుల దాణా తయారు చేయండి. మీరు ఏం చేద్దామన్న మీకు అండగా మిమ్మల్ని పారిశ్రామిక వేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం వంద శాతం భరోసా కల్పిస్తుంది.

అంతేకాదు ఆర్థికంగానూ ప్రోత్సహం అందిస్తుంది. అయితే ఆ పథకం పేరేంటి? అర్హతల వివరాలు, ఎలా అప్లై చేయాలని అనుకుంటున్నారా? అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.

***పారిశ్రామికవేత్తగా మారాలంటే కావాల్సిందల్లా ఒకటే. మీరు ఆసక్తిగా ముందడుగు వేయడమే. 10 శాతం పెట్టుబడి, రాణించేందుకు కృషి ఉంటే చాలు మీరే మరో పది మందికి ఉపాధి కల్పించవచ్చు.***

పారిశ్రామికవేత్తగా మారాలంటే కావాల్సిందల్లా ఒకటే. మీరు ఆసక్తిగా ముందడుగు వేయడమే. 10 శాతం పెట్టుబడి, రాణించేందుకు కృషి ఉంటే చాలు మీరే మరో పది మందికి ఉపాధి కల్పించవచ్చు. అంతేకాదు ఉత్పత్తుల నాణ్యత ఆధారంగా మీకంటూ ఒక బ్రాండ్‌నూ సృష్టించుకోవచ్చు. ఇప్పటికే యూనిట్లు ఉన్నా, రుణం తీసుకొని వాటిని విస్తరించుకోవచ్చు.

**రాయితీలు ఇలా :** మీ యూనిట్‌కు ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) కింద 35 శాతం రాయితీ (గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు) ఇస్తుంది. అలాగే బ్యాంకు రుణం 55 శాతం అందేలా చేస్తుంది.

**పొదుపు సంఘాల మహిళలకు ప్రోత్సాహకాలు :** పొదుపు సంఘాల్లో ఉండే మహిళలకు ఒక్కొక్కరికీ రూ.40 వేల చొప్పున సాయం అందిస్తారు.

ఆ నగదును ముడి సరకు, ప్యాకింగ్, ఇతరత్రా పెట్టుబడిగా ఉపయోగించుకొని ఆ తర్వాత పొదుపు సంఘానికి చెల్లించవచ్చు. వీరు కూడా 35 శాతం రాయితీపై రుణం తీసుకొని యూనిట్‌ను విస్తరించుకోవచ్చు.

**దరఖాస్తు చేయడం :**

- జిల్లా స్థాయిలోని రిసోర్స్ పర్సన్స్ ద్వారా వివరాలు తీసుకోవచ్చు.
  https://pmfme.mofpi.gov.in/pmfme/#login లో యూనిట్ వివరాలతో దరఖాస్తు చేయాలి.
- ఆహారశుద్ధి పథకాల కోసం తెలంగాణ వెబ్‌సైట్ చిరునామా https://tgfps.telangana.gov.in/pmfme/ వివరాలకు 81210 09155

**ఈ పత్రాలు ఉంటే సరిపోతుంది :**

- ఆధార్ కార్డు, పాన్‌కార్డు
- యూనిట్ చిరునామా ధ్రువీకరణ పత్రం (విద్యుత్, వాటర్, ఫోన్, గ్యాస్ బిల్)
- యూనిట్ నిర్వహించే భవనం లేదా భూ యాజమాన్య ధ్రువీకరణ పత్రం
- గత ఆరు నెలల బ్యాంకు స్టేట్‌మెంట్
- యంత్రాలు
- షెడ్‌కు సంబంధించిన కొటేషన్లు అప్‌లోడ్ చేయాలి.

**ఇలా దరఖాస్తు ప్రాసెస్ చేస్తారు :** మీరు పంపే దరఖాస్తును రిసోర్సు పర్సన్ పరిశీలించి జిల్లా కమిటీకి సిఫారసు చేస్తారు. అక్కడ కలెక్టర్ అధ్యక్షతన ఉండే ఈ కమిటీ యూనిట్ వివరాలను పరిశీలించి బ్యాంకుకు పంపిస్తారు. రుణచరిత్ర బాగుంటే బ్యాంకు రుణం మంజూరు చేస్తుంది. ఆ తర్వాత 3 నెలల్లో రాయితీ బ్యాంకు ఖాతాకు

జమ అవుతుంది.

**యూనిట్ వ్యయం – వచ్చే నగదు :**

**1. యూనిట్ వ్యయం : రూ.5 లక్షల లోపు ఉంటే**

వెజ్, నాన్‌వెజ్ పచ్చళ్లు, పిండి మరలు, పసుపు, మిరప, మసాలా పొడులు, పూతరేకులు, కొబ్బరి బర్ఫి, కొబ్బరిపొడి, రొట్టెలు, అరటి చిప్స్, కేక్స్, దోశలు, ఇడ్లీ పిండి తయారీ, అప్పడాలు, ప్యాకింగ్. ఒడియాలు, ఫ్లేవర్డ్ మిల్క్, వేరుసెనగ చెక్క, సోలార్ డీహైడ్రేషన్ యూనిట్లు సహా ఎలాంటివైనా పెట్టుకోవచ్చు.

**2. యూనిట్: రూ. 5 లక్షలు – 10 లక్షలు ఉంటే...**

చాక్లెట్లు, వంట నూనెలు, ఛీజ్, పన్నీరు, నూడుల్స్, సేమియా, చిరుధాన్యాల ఆధారిత ఉత్పత్తులు, జెల్లీ, చపాతీ, పండ్ల జామ్, పరోటా, పశువుల దాణా తయారీ, అరటి పొడి, మిల్లెట్ ఫ్లేక్స్, డీహైడ్రేటెడ్ ఫ్రూట్ పౌడర్, అల్లం–వెల్లుల్లి పేస్టు, నన్నారి, పానిపూరీ తయారీ కేంద్రాలను పెట్టుకోవచ్చు.

**3. యూనిట్: రూ.10 లక్షలు– 20 లక్షలు ఉంటే...**

పప్పు మిల్లులు, మినీ ధాన్యం, సాస్, జెల్లీ, తేనె శుద్ధి, కెచప్, ఇన్‌స్టెంట్ ప్రీమిక్స్ (గులాబ్‌జాం, కేక్‌లు, ఖీర్), ప్యాకింగ్, నూనెల తయారీ, కొబ్బరి పాలు, చిరుధాన్యాల ఆధారిత ప్రాథమిక ఆహార శుద్ధి యూనిట్లు వంటివి పెట్టవచ్చు.

**4. యూనిట్: రూ.20 లక్షలు– 35 లక్షలు ఉంటే**

చపాతి, పరోటా, ఐస్‌క్రీమ్, స్నాక్స్‌లు, మిల్లెట్ పాస్తా, రవ్వ, పిండి యూనిట్లు, కొబ్బరి నీటి సీసాలు, సోయా ప్రాసెసింగ్, పిల్లల పోషకాహారం, ఫ్రూట్ బార్స్ తదితరాలను పెట్టవచ్చు.

**5. యూనిట్: రూ.35లక్షల నుంచి రూ.50 లక్షలు, ఆపైన ఉంటే...**

పశువుల దాణా, కాఫీ ప్రాసెసింగ్, లెమన్ ప్రాసెసింగ్, ప్రోబయోటిక్ డ్రింక్స్, మాంసం, చేపలు ప్రాసెసింగ్, చెరకు ఆధారిత బెల్లం, సిరప్ తయారీ, మిల్క్ చిల్లింగ్, పండ్ల రసాల యూనిట్, మొక్కజొన్న ఉత్పత్తులు తదితరాలు పెట్టుకోవచ్చు. ■

## విశాఖ ఉపాధ్యాయినికి జాతీయ అవార్డు

పాఠాలు ప్రతి టీచరూ చెబుతారు. కానీ, విద్యార్థుల మనసుకు హత్తుకునేలా, వారిలో జిజ్ఞాసను మరింత పెంచేలా వినూత్న విధానాలు అవలంబించి బోధించే ఉపాధ్యాయులు



అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో విశాఖపట్నానికి చెందిన మాదాబత్తుల తిరుమల శ్రీదేవి ఒకరు. ఒత్తిడి రహిత విధానాలు, వినూత్న ఆలోచనలను కలగలిపి సరికొత్త పంథాను ఎంచుకుని విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ‘చదువుకునేందుకు రండి – దేశ సేవకు వెళ్లండి’ అనే థీమ్‌తో విద్యార్థి దశ నుంచే దేశానికి సేవ చేయాలన్న స్ఫూర్తిని నింపుతున్న నిబద్ధతే.. ఆమెను ‘జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ’ అవార్డుకు ఎంపిక చేసింది.

విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలోని పండిట్ నెహ్రూ జీవీఎంసీ మునిసిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా (బయాలజీ టీచర్) పని చేస్తున్న మాదాబత్తుల తిరుమల శ్రీదేవి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ టీచింగ్, లెర్నింగ్ విధానంలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఆమె సెప్టెంబరు 5న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందుకోనున్నారు.

విశాఖపట్నం జిల్లాలోని తగరపువలస ప్రాంతానికి చెందిన తిరుమల శ్రీదేవి 2001లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించారు. ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ టీచింగ్, లెర్నింగ్ విధానంలో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, చదువు పట్ల ఆసక్తి పెంచుతారు. విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకువెళ్లి ప్రాజెక్టులు చేయిస్తారు.

శ్రీదేవి బోధనా విధానాలపై ఆలిండియా రేడియో.. ‘గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్’ ప్రమోషన్, ‘గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్’ అనే డాక్యుమెంటరీని రూపొందించారు. 2018లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టీచర్ అవార్డును అందుకున్నారు. ■

నీ శక్తి సామర్థ్యాలను అనుమానిస్తే బాధపడకూడదు, ఎందుకంటె బంగారం నాణ్యతను శంకిస్తారు కాని ఇనుమును కాదుగా!

# తెలంగాణాలో అత్యధికంగా సైబర్ నేరాలు!

సైబర్ నేరాల విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధికంగా అప్రతిష్ఠను మూటగట్టుకుంది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ క్రైమ్ రేటుతో పోలిస్తే తెలంగాణలో దాదాపు 10 రెట్లు అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ షాకింగ్ విషయాలను జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) మంగళ వారం విడుదల చేసిన 2022 మధ్యంతర డేటా వెల్లడించింది.

**దేశ సగటు కంటే 10 రెట్లు ఎక్కువ !**



ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ రేటు సగటున 4.8 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది 40.3 శాతంగా నమోదైంది. దీంతో ఈ జాబితాలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే సైబర్ నేరగాళ్లు ఎక్కువగా క్రియాశీలంగా ఉన్నట్లు ఈ నివేదిక సూచిస్తోంది. తెలంగాణ తర్వాత కర్ణాటక రెండో స్థానంలో ఉంది.

ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, మహారాష్ట్రలో సైబర్ క్రైమ్ రేటు 6.6 శాతంగా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 4.4, అసోంలో 4.9, ఉత్తరప్రదేశ్, ఒడిశాలలో 4.3 శాతం చొప్పున ఉంది. పెద్ద రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ కేవలం 0.4 శాతం క్రైమ్ రేటుతో మెరుగైన స్థానంలో నిలవడం గమనార్హం. కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఢిల్లీ 3.2 శాతం, పుదుచ్చేరి 3.9శాతం క్రైమ్ రేటుతో సైబర్ నేరాలకు హాట్‌స్పాట్‌లుగా మారాయి.

ఢిల్లీ పోలీసుల డేటా ప్రకారం, 2024లో సైబర్ మోసాల ద్వారా ఢిల్లీ వాసులు రూ. 817 కోట్లు నష్ట పోయారు. 2025లో జూన్ 30 నాటికి మొదటి ఆరు నెలల్లోనే రూ. 70.64 కోట్లు కోల్పోయారు.

దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల లోక్‌సభకు తెలిపారు.



ఇందులో భాగంగా 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల కోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' (cybercrime.gov.in) ప్రారంభించామని వివరించారు. దీంతో పాటు, మహిళలు, చిన్నారులపై జరిగే సైబర్ నేరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు పోలీస్ విభాగాల్లో ప్రత్యేక యూనిట్లను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

■

నమ్మితే మౌనం కూడా చక్కగా అర్థమవుతుంది, నమ్మకం లేకుంటే ప్రతి మాట అపార్థంగానే వినిపిస్తుంది

# స్త్రీధన్ పై హక్కు మహిళలకు మాత్రమే !

వివాహిత మహిళల హక్కుల గురించి ఇటీవల సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. స్త్రీధన్ (ఆస్తి) మహిళలకు మాత్రమే చెందుతుందని స్పష్టం చేసింది. స్త్రీ ధన్ భార్యాభర్తల ఉమ్మడి ఆస్తిగా మారదని, ఆస్తిపై భర్తకు ఎలాంటి హక్కు, ఆధిపత్యం ఉండదని స్పష్టంచేసింది.

స్త్రీధన్‌పై ఆమె వివాహం తర్వాత భర్త లేదా అత్తమామల అదుపులో తాత్కాలికంగా ఉంచినప్పటికీ వారు ధర్మకర్తలుగా వ్యవహరించాలే తప్ప.. ఆ ఆస్తిని స్వప్రయోజనాల కోసం వాడుకోవడం గానీ, దుర్వినియోగం చేయడం గానీ చేయకూడదు. ఆమె ఎప్పుడు అడిగినా వెంటనే ఆ ఆస్తిని ఆమెకు స్వాధీనపరచాలి. తిరిగి ఇవ్వడానికి నిరాకరించడం నేరపూరిత ఉల్లంఘన కిందకి వస్తుందని సుప్రీంకోర్టు తెలిపింది.

**స్త్రీధన్ అంటే ఏంటి?**

స్త్రీధన్.. పేరుకు తగ్గట్టే మహిళకు సంబంధించిన ఆస్తి అని అర్థం. హిందూ వివాహిత మహిళ ఆస్తి గురించి మాట్లాడేటప్పుడు.. కట్నం, భరణం వంటి పదాలు గుర్తుకు వస్తాయి. ఇందులో వరకట్నం, స్త్రీధన్ అనేవి వేర్వేరు పదాలు. ప్రజలు స్త్రీధన్‌ను వరకట్నంతో పోలుస్తారు. అది సరికాదు. స్త్రీధన్ చట్టబద్ధమైనది, వరకట్నం చట్ట విరుద్ధం.

ఉమ్మడి ఆస్తులు, వాటిలో తమ వాటా గురించి తెలియని వివాహిత మహిళలు వీటిపై కనీస అవగాహన కలిగి ఉండాలి. స్త్రీధన్.. వరకట్నం, భరణం మధ్య వ్యత్యాసాన్ని కూడా వివరిస్తుంది. అయితే భరణం ఒక మహిళ తన భర్త నుంచి విడిపోయిన తర్వాత తన మద్దతు/జీవనాధారం కోసం హక్కును కలిగి ఉంటుంది. మహిళలు స్త్రీధన్‌కు సంబంధించిన చట్టాలు, నియమనిబంధనల గురించి తెలుసుకోవాలి.

**స్త్రీధన్ పరిధిలో ఉన్న ఆస్తులు**

స్త్రీధన్ కింద మహిళకు చెందిన చర, స్థిరాస్తులే కాకుండా దాని పరిధిలో అనేకమైనవి ఉన్నాయి. అన్ని రకాల ఆభరణాలు (బంగారం, వెండి, విలువైన రాళ్లు మొదలైనవి). కారు లాంటి విలువైన వస్తువులు, పెయింటింగ్‌లు, కళా ఖండాలు, గృహోపకరణాలు, ఫర్నీచర్ మొదలైనవి.

వివాహానికి ముందు, తర్వాత సమయంలో మహిళకు బహుమతిగా వచ్చినవి కూడా స్త్రీధన్ కింద ఆమెకే చెందుతాయి. బహుమతులు.. తల్లిదండ్రులు, అత్తమామలు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల నుంచి రావచ్చు. లేదా మహిళ సంపాదన/రాబడితో చేసిన ఏవైనా పొదుపులు, పెట్టుబడులు.. వాటి వల్ల వచ్చిన రాబడులు ఆమెకే దక్కుతాయి. హిందూ మతంలోనే కాకుండా ఇతర మతాలలో కూడా మహిళల ఆస్తులు లేదా వివాహ సమయంలో పొందిన బహుమతులను రక్షించడానికి ఇలాంటి నిబంధనలు ఉన్నాయి.

**స్త్రీధన్ కోసం ఏం చేయాలి?**

మహిళ పేరు మీద వివాహానికి ముందు/తర్వాత అనేక విలువైన ఆస్తులు, బహుమతులు వస్తుంటాయి. మహిళ తన/భర్త కుటుంబం, స్నేహితులు, ఇతర పరిచయస్తుల నుంచి వచ్చే అన్ని బహుమతులు, ఆస్తుల జాబితాను రాసుకోవాలి. విలువైన ఆభరణాల జాబితాను రాసుకుని తన పేరు మీద బ్యాంకు లాకర్‌లో భద్రపరచుకోవడం మేలు. నగదును తన పేరు మీద బ్యాంకులో డిపాజిట్ చేసుకోవచ్చు.

ఆభరణాలు, విలువైన వస్తువులకు సాక్ష్యంగా పెళ్లి ఫోటోలను ఉపయోగించుకోవచ్చు. అన్నిటికన్నా ముఖ్యమైనది.. విలువైన ప్రతి వస్తువుకు బిల్లులు ఆమె పేరు మీద ఉండేలా చూసుకుంటే భవిష్యత్తులో చాలా ప్రయోజనముంటుంది. మహిళకు సంపాదన (ఆస్తి, జీతం ద్వారా) ఉన్నప్పుడు ఆమె పేరు మీద బ్యాంకులో ప్రత్యేక ఖాతాను నిర్వహించాలి.

ముఖ్యంగా మహిళ తల్లిదండ్రులు ఖరీదైన వినియోగ

వస్తువుల కంటే ఆమెకు ఆదాయాన్ని సంపాదించిపెట్టే ఆస్తిని బహుమతిగా ఇవ్వడం మంచిది. దీనివల్ల ఆమె ఆస్తి ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంటుంది.

**స్త్రీధన్ పరిధిలో లేనివి**

వివాహ సమయంలో భార్య తల్లిదండ్రులు భర్తకు బహుమతిగా ఇచ్చిన ఉంగరం, బంగారు గొలుసు వంటి ఏదైనా ఆభరణాలు, ఇతర వస్తువులు స్త్రీధన్ పరిధిలోకి రావు. భార్య పేరు మీద భర్త ఏదైనా చర, స్థిరాస్తిని కొనుగోలు చేసి బహుమతిగా ఇవ్వకున్నా ఆ ఆస్తి స్త్రీధన్ కిందకు రాదు. వివాహిత సంపాదనతో ఇల్లు గడవడానికి ఖర్చుల నిమిత్తం వెచ్చించినా అది తిరిగి క్లెయిం చేయలేరు.

**చివరిగా...**

మహిళకు స్త్రీధన్‌పై విడదీయరాని హక్కు ఉంది. ఆమె తన భర్త నుంచి విడిపోయిన తర్వాత కూడా దాన్ని క్లెయిం చేయొచ్చు. ఆమె క్లెయింను తిరస్కరించడం కూడా గృహ హింస కిందకు వస్తుంది. ఆమె భర్తతో పాటు అత్తమామలు కూడా క్రిమినల్ ప్రాసిక్యూషన్ ఎదుర్కోవాల్సి ఉంటుంది. భర్త, అతడి కుటుంబం ఆమె ఆస్తిని ఆక్రమించినట్లయితే చట్టంలో ఆమె ప్రయోజనాలను పరిరక్షించడానికి నిబంధనలు ఉన్నాయి.

ఆమె ఆస్తిని.. భర్త గానీ అతడి కుటుంబ సభ్యులు గానీ అడిగినప్పుడు తిరిగి ఇవ్వకపోతే ఆ స్త్రీ భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 406 ప్రకారం 'నేరపూరిత నమ్మక ఉల్లంఘన' (క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్) కేసు పెట్టొచ్చు. దీని ప్రకారం కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా కూడా విధించవచ్చు.

భర్త చేసిన అప్పులు తీర్చడానికి మహిళకు సంబంధించిన ఆస్తి ఉపయోగించకూడదని కోర్టులు స్పష్టంగా చెప్పాయి. స్త్రీధన్ భార్య, భర్తల ఉమ్మడి ఆస్తిగా మారదు. యజమానిగా ఆస్తిపై భర్తకు ఎలాంటి ఆధిపత్యం ఉండదు. స్త్రీధన్ అనేది మహిళకు సంబంధించిన సంపూర్ణ ఆస్తి అని చట్టం చెబుతోంది.

– ఈనాడు సౌజన్యంతో

■

## నేలలో సూక్ష్మజీవులే సేద్యం చేస్తాయి!

**ఒక** టీ స్పూను మట్టిలో సుమారు 100 కోట్ల సూక్ష్మ జీవులు ఉంటాయి. బాక్టీరియాలు, ఫంగస్‌లు, ప్రోటోజావా, ఆల్గేగా పేర్కొంటారు. అతి చిన్న, చిన్న, మధ్య, పెద్ద, అతిపెద్ద జీవులుగా ఆకారాన్ని బట్టి విడదీస్తారు. ఇవి అన్నీ పరస్పరం సహకరించుకొంటాయి, వికర్షించుకొంటాయి. కొన్ని ఒక దాన్ని ఒకటి తింటాయి. ఆహారం కోసం సహకరించు కొంటాయి. పోటీ పడతాయి.

**రక రకాలసూక్ష్మ జీవులు – రక రకాల పనులు**

1. సేంద్రియ వ్యర్థాలను చివికి పోయేలా చేసి మట్టిలో కలుపుతాయి.
2. పోషకాలను విడుదల చేస్తాయి.
3. హ్యూమస్‌ను తయారు చేస్తాయి.
4. మట్టి రేణువుల సముదాయాలు ఏర్పాటు చేసి గాలి, నీరు ప్రవేశించడానికి దారుల్ని ఏర్పరుస్తాయి.
5. నేలపైన ఉన్న వ్యర్థాలను మట్టిలోనికి తీసికొనిపోతాయి.

**ఎరువులు వేయాలి**

ఎరువులు వేయడం అంటే సూక్ష్మజీవులకు ఆహారం వేయడం. రసాయనిక ఎరువులు వేస్తే అవి చచ్చి పోతాయి. నేల జీవం కోల్పోతుంది. నేల నుండి సహజ సిద్ధంగా అందవలసిన పోషకాలు అసహజంగా చెట్టుకు అందుతుంది. నేల నిర్మాణం ధ్వంసం అవుతుంది.

**నేలలో నిర్వహణ పద్ధతుల వల్ల జీవ వైవిధ్యం వుంటుంది.**

1. నేలను తక్కువగా దున్నడం.
2. భూమిని కప్పి ఉంచే పంటలను సాగు చేయడం
3. ప్రతి సంవత్సరం సేంద్రియ పదార్థాలను వేయడం
4. తటస్థ స్థాయిలో ఉదజని స్థాయిలు వుంచడం.

కనుక పండ్ల తోటలలో సేంద్రియ ఎరువులు వేసి, నవధాన్యాలు చల్లి వదిలేయడం ఉత్తమ సేద్య, విధానం.

■

# మెప్మా ద్వారా మహిళలకు రకరకాల ఉపాధులు !

**ప**ట్టణాలు, నగరాల్లోని స్వయం సహాయక సంఘాల ద్వారా సుస్థిర జీవనోపాధిపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ – మెప్మా (మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్) ఆధ్వర్యంలో వివిధ శిక్షణలు, ఆర్థిక సహకారం అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న పథకాలపై ఎస్‌హెచ్‌జీ మహిళలకు అవగాహన కల్పిస్తూనే, ఆర్థిక చేయూత అందించేందుకు తోడ్పాటుగా నిలుస్తోంది.

డ్వాక్రాతో దేశానికి ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర మహిళలు, ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాలతో ప్రయాణికుల గమ్యస్థానాలకు చేరుస్తూ ఆర్జిస్తున్నారు. మెప్మా, ర్యాపిడో సహకారంతో స్వయం ఉపాధి పొందుతున్నారు. ఈ ఉపాధి కార్యక్రమానికి మార్చి 8న, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తొలి అడుగు పడింది. అదేరోజున సీఎం చంద్రబాబు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదలైంది. ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త కింద మెప్మా సంస్థ ర్యాపిడో ద్వారా మహిళలకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించింది. అందులో తొలి దశలో తొమ్మిది పట్టణాల్లో వెయ్యి మంది లబ్ధిదారులకు రుణ సౌకర్యం కల్పించారు. వీటిలో విశాఖపట్నంలో 400 వాహనాలు, విజయవాడలో 400, నెల్లూరు, గుంటూరులో 50 చొప్పున, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రిలో 25 వాహనాలు చొప్పున మహిళలకు అందజేశారు. వాటిలో 760 ఎలక్ట్రిక్ టూ-వీలర్లు కాగా, 240 ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు ఉన్నాయి. మొత్తంగా ఇప్పటివరకు వెయ్యికి పైగా కుటుంబాలు లబ్ధి పొందగా, వారిలో 688 మంది ర్యాపిడోలో నమోదయ్యారు.

**డ్వాక్రా, మెప్మా సహకారంతో..** వాహనాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన బ్యాంకు రుణాలు డ్వాక్రా సంఘాల మహిళల పేర్లతో మంజూరయ్యాయి. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వారి కుటుంబ సభ్యులు వాహనం నడిపేందుకు అవకాశం కల్పించారు. అవసరమైన ప్రాజెక్టు రిపోర్టులను మెప్మా సిద్ధం చేసి, జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు సహకారం అందించింది. ఈ క్రమంలో ర్యాపిడో సైతం మహిళలకు సాధికారత అందించడంలో భాగస్వామ్యమైంది. కొత్తగా చేరిన వారికి ప్లాట్‌ఫామ్ ఫీజులో మూడు నుంచి నాలుగు నెలల మినహాయింపు ఇచ్చింది.

అలాగే తొలి సంవత్సరం టూ-వీలర్, త్రీవీలర్ యజమానులకు నెలకు రూ. వెయ్యి చొప్పున ఈఎంఐ మొత్తాన్ని సాయంగా అందించారు. దీంతో ర్యాపిడో నడపటం ప్రారంభించిన గృహిణులకు తొలిరోజు నుంచే ఆదాయం ప్రారంభమైంది. అలాగే ఈఎంఐ, ఇంధన భారం కూడా తగ్గింది.

**రూ. 16 వేల వరకు ఆదాయం**

మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎలక్ట్రిక్ స్కూటర్, ఆటోలకు రూ. 12,300 నుంచి రూ. 36 వేల వరకు సబ్సిడీ అందిస్తోంది. ర్యాపిడోలో వాహనం నడుపుతున్న మహిళలు నెలకు సుమారు రూ. 13 నుంచి రూ. 16 వేల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. మహిళల విజయగాథల స్ఫూర్తితో రాబోయే ఏడాదిలో మరో 4,800 మందికి ఈ పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**ఇది ఆరంభం మాత్రమే: లోకేశ్**

మహిళల సాధికారతే ప్రభుత్వ ఆలోచన అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ర్యాపిడో తోడ్పాటుతో రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా మహిళలు స్వయం ఉపాధి సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో మహిళా సాధికారతకు మరింత కృషి చేస్తామని మంత్రి వెల్లడించారు

**మరికొందరు మహిళల విజయగాథలు ఇవీ..**

విజయవాడకు చెందిన వడ్లపడి గ్లోరీ మంజు మార్చిలో ప్రభుత్వ సబ్సిడీతో స్కూటర్ కొని ర్యాపిడో నడపడం ప్రారంభించారు. ప్రస్తుతం నెలకు రూ.10 వేల వరకు

నీవంటే ఇష్టపడడం వేరు, గౌరవించడం వేరు ; ఇష్టపడే వారెందరో, గౌరవించే వారు కొందరే, గౌరవం పొందడమే గొప్పతనం

సంపాదిస్తున్నారు. ఈఎంఐ చెల్లిస్తూ, కొంత సొమ్మును పొదుపు చేస్తున్నానని మంజు చెబుతున్నా రు. విజయవాడ లోని కండ్రిక ప్రాంతానికి చెందిన మాధవి తన భర్తకు పక్షపాతం రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భర్తకు వచ్చే రూ.6వేల దివ్యాంగ పింఛన్ మందులకే సరిపో తుండటంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. ఈ సమయం లో మెప్మా ద్వారా రుణం పొంది టూ–వీలర్ కొన్నానన్నారు. నెలకు రూ.12 వేల వరకూ సంపాదిస్తున్నా అని చెప్పారు. విజయవాడకు చెందిన భవానీ భర్త అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితమయ్యారు. ఇంటి బాధ్యతను తలకెత్తుకున్న భవానీ మెప్మా అధికారుల సహకారంతో రూ. 1.20లక్షల విలువైనఈ–స్కూటర్ కొనుగోలుచేసి ర్యాపిడోలో చేరారు. ప్రస్తుతం రోజుకు రూ.500–700 వరకు సంపాదిస్తున్నారు.



**మెప్మా ద్వారా ఆశాజనకంగా వ్యాపారాలు :**

విజయవాడ పరిధిలో 12 వందల యూనిట్లు మెప్మా ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఇందులో 10 ఏళ్ల క్రితమే పెట్టిన చాలా యూనిట్ల వారు మెప్మా ద్వారా రుణాలు పొంది చక్కగా వ్యాపారాలు సాగిస్తున్నారు. స్వయం వృద్ధి పొందు తూనే తోటి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. సత్యనారాయణపురంలోని నాగభరణి లేడీస్ ఎంపోరియంలో ఆరుగురు మహిళలు పని చేస్తున్నారు. వీరంతా డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నారు. ఈ పని వల్ల రోజుకు రూ.600 నుంచి రూ. 800 వరకు సంపాదిస్తున్నామని చెబుతున్నారు.

"మెప్మా ద్వారా టైలరింగ్, చేతివృత్తులు మొదలైన రకాల వృత్తులపై శిక్షణను ఇస్తున్నాం. దీని ద్వారా అనేకమందికి ఉపాధిని అందించగలిగాం. నా దగ్గర పని చేసే మహిళలకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నాం. భవిష్యత్తులో మరింత మందికి శిక్షణను అందివ్వాలని అనుకుంటున్నాం. అందుకు ప్రభుత్వం మమ్మల్ని ప్రోత్సహించాలని కోరుతున్నాం"

***– నాగభరణి, భరణి లేడీస్ టైలర్ యజమాని***

మెప్మా ద్వారానే లబ్ధి పొంది విజయవంతంగా వ్యాపారం సాగిస్తున్నారు రాజకుమారి. 2007 నుంచి డ్వాక్రా గ్రూపుల్లో సభ్యురాలుగా ఉన్న రాజకుమారి మెప్మా ద్వారా ఆర్థిక సాయం పొంది 2021లో పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్ పెట్టారు. డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా ఉన్న మరో మహిళ ఝాన్సీ వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. ఆమె భర్త మొదట ఆటోతో ఇంటింటికి నీటి క్యాన్లు వేసేవారు. ఆ తర్వాత డ్వాక్రా సంఘంలో కొంత రుణం తీసుకుని వారే సొంతంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నారు.

"2007వ సంవత్సరం నుంచి డ్వాక్రా గ్రూపుల్లో సభ్యురాలుగా ఉన్నాను. అప్పటి నుంచి నాకు వచ్చే ఆదాయాన్ని ఇందులో పొదుపు చేస్తున్నాను. ఈ మెప్మా ద్వారా ఆర్థిక సాయం పొంది 2021లో పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేసుకున్నాం. దీంతో వచ్చే ఆదాయం ద్వారా మా కుటుంబమంతా జీవనాన్ని సాగిస్తున్నాం"

***– ఝాన్సీరాణి, జాష్వా వాటర్ ప్లాంట్, విజయవాడ***

ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారిని తయారు చేయాలన్న ముఖ్యమంత్రి ఆలోచనకు అనుగుణంగా పని చేస్తున్నామని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో టెక్నికల్ నిపుణురాలుగా చేస్తున్న సుజాత చెప్పారు. "సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనకు అనుగుణంగా పని చేస్తున్నాం. డ్వాక్రా గ్రూపులో ఉన్న మహిళలకు వారి వారి అర్హతల ఆధారంగా ఎంఎస్ఎంఈ ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నాం. ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారిని తయారు చేయాలన్న ఆలోచనను అమలు చేస్తున్నాం"

***– సుజాత, సాంకేతిక నిపుణురాలు, వీఎంసి***

(ఈ–టివి భారత్ సౌజన్యంతో).

■

ఆత్మీయంగా వుండడం సులభమే, ఆత్మీయతను పొందడమే కష్టం ; అందుకే ఆత్మీయులను ఎన్నడూ దూరంచేసుకోకూడదు

# పంట తెగుళ్ళ భరతంపట్టే ఈ - స్మార్ట్ రోబోలు !

**పం**టను కాపాడుకునే క్రమంలో రైతులు, పొలంలో వివిధ రకాల రసాయనాలు చల్లి తమ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వారి ఆరోగ్య దృష్ట్యా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ల బృందం వినూత్న ఆలోచన చేసింది. వ్యవసాయ రంగంలో మనుషులకు బదులు స్మార్ట్ రోబో వ్యవస్థను అభివృద్ధి చేసింది.


ఐఐటీ ఖరగ్‌పూర్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రొఫెసర్ల బృందం దీన్ని అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ దిలీప్ కుమార్ ప్రతిహార్ మాట్లాడారు. వ్యవసాయ రంగంలో రోబో పనితీరు, దాని సామర్థ్యాల గురించి తెలిపారు.

**డ్రోన్ కంటే మెరుగ్గా**

'ఇదివరకు డ్రోన్ల ద్వారా మందుల పిచికారి జరిగేది. కానీ, అందులో లోపం ఉండడం వల్ల ఈ రోబో వ్యవస్థను ప్రవేశపెట్టాము. సాధారణంగా డ్రోన్ల ద్వారా వ్యవసాయ పిచికారి చేయడం వల్ల, రసాయనాలు మొక్క పూర్తి అంచువరకు వెళ్లవు.

తెగుళ్ల నివారణలో దాని పని విధానం అంతగా ఉండకపోగా డ్రోన్ ద్వారా పిచికారి చేయడం వల్ల మొక్క





ఆకులు పాడయ్యే అవకాశం ఉంది. ఈ సమస్యను పరిష్కరించడానికి గత కొద్ది సంవత్సరాలుగా దీనిపై అనేక పరిశోధనలు చేస్తున్నాం. అందులో భాగంగా రోబో ద్వారా పిచికారి చేయాలని ఆలోచన వచ్చింది' అని ప్రొఫెసర్ దిలీప్ కుమార్ తెలిపారు.

**గుంతల్లో కూడా సులువుగా**

ఈ రోబో తెగుళ్లలో ఉన్న సమస్యలను గుర్తించి దానిని పరిష్కరిస్తుందని ప్రొఫెసర్ దిలీప్ కుమార్ చెప్పారు. ఇది 'సెమీ ఆటోమెటిక్ ట్రాక్డ్ మొబైల్ మానిప్యులేటర్' వ్యవస్థ ఆధారంగా పనిచేస్తుందన్నారు. రోబో పనితీరు గురించి అందరికీ ప్రయోగపూర్వకంగా వివరించారు. అలాగే దీనికి 'ఫామ్ బోట్' అని నామకరణం కూడా చేశారు. ఇది మొక్కపై ఉన్న తెగుళ్లను గుర్తించి మందు పిచికారి చేసి వాటిని నివారిస్తుందన్నారు. ఇవి బురద, గుంతలు వంటి ప్రాంతాల్లో కూడా సులువుగా పనిచేస్తుందన్నారు. ఇందులో ఉండే ఆటోమెటిక్ కెమెరా, వ్యవసాయ క్షేత్రాన్ని ఇరువైపులా స్కాన్ చేసి పని చేయడం ప్రారంభిస్తుందన్నారు. ఇది వివిధ అప్లికేషన్లతో పని చేస్తుందని తెలిపారు.

(ఈ టివి భారత్ సౌజన్యంతో)

■

గౌరవం రెండు విధాలుగా వస్తుంది ; అధికారంతో లేదా ప్రవర్తనతో ; మొదటిది తాత్కాలికం, రెండవది శాశ్వతం

# భారతీయ స్వచ్ఛంద సంస్థకు రామన్ మెగసెసే అవార్డు

**మా**రుమూల గ్రామాల్లో బాలికల విద్యకోసం విశేషంగా కృషిచేసిన భారతీయ స్వచ్ఛంద సంస్థ 'ది ఫౌండేషన్ టు ఎడ్యుకేట్ గర్ల్స్' ను ఈ ఏడాది రామన్ మెగసెసే అవార్డు వరించింది. ఆసియాలో నోబెల్ బహుమతికి సమానమైనదిగా పరిగణించే రామన్ మెగసెసే అవార్డు-2025లను ఆదివారం ప్రకటించారు. ఆసియా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడంలో ప్రదర్శించే గొప్పస్ఫూర్తికి గుర్తింపుగా ఈ అవార్డుతో సత్కరిస్తారు.

ఈ అవార్డు అందుకున్న తొలి భారతీయ సంస్థగా 'ది ఫౌండేషన్ టు ఎడ్యుకేట్ గర్ల్స్' చరిత్ర సృష్టించిందని రామన్ మెగసెసే అవార్డ్ ఫౌండేషన్ (ఆర్ఎంఏఎఫ్) ఒక ప్రకటనలో తెలిపింది. "సఫీనా హుస్సేన్ స్థాపించిన ఎడ్యుకేట్ గర్ల్స్' సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించింది. బాలికలు, యువతు లను నిరక్షరాస్యత నుంచి బంధవిముక్తం చేసేందుకు, పూర్తి మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు వారిలో నైపుణ్యాలు, ధైర్యం పెంపొందించేందుకు ఈ సంస్థ నిబద్ధతతో పని చేసింది" అని ప్రశంసించింది. సఫీనా హుసేన్ 2007లో ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థను స్థాపించారు. తొలుత రాజస్థాన్‌లో ఈ సంస్థ కృషిని ప్రారంభించింది. 50 గ్రామాల్లో పైలట్ స్కూళ్లను నెలకొల్పింది.

దేశవ్యాప్తంగా 30వేల వరకూ అత్యంత మారుమూల గ్రామాలను చేరు కొంది. సుమారు 20 లక్షల మంది బాలికలకు విద్యనందిం చింది. మాల్దీవులలో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసిన షాహీనా అలీ, ఫిలిప్పీన్స్‌లో పేదలు, అణగారిన వర్గాల గౌరవం కోసం పనిచేసిన ఫ్లావియానో ఆంటోనియో ఎల్ విల్లానుయెవా కూడా ఈ ఏడాది రామన్ మెగసెసే అవార్డులు దక్కించుకున్నారు. ■

## టమాటాకు నల్ల మచ్చల తెగుళ్ళ బెడద

**రై**తులు రూ.లక్షలు ఖర్చుపెట్టి సాగుచేసిన టమాటా పంట ఎడతెరిపి లేని వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. ఆకులు, కాయలపై నల్లమచ్చులు, తెగుళ్లు వ్యాపించడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో 1,150 ఎకరాల్లో టమాట సాగైనట్లు అధికారుల లెక్కలు చెబుతుండగా, అనధికారికంగా మరో 500 ఎకరాల్లో సాగైంది. మే నెలాఖరు, జూన్‌లో సాగు చేసిన పంటలను ప్రస్తుతం కోత కోస్తుండగా, జూలైలో సాగైన పంటలు పూత దశలో ఉన్నాయి. వర్ష ప్రభావంతో కాయలపై నల్లమచ్చులు అధికంగా రావడంతో రైతులు మార్కెట్‌కు తరలించలేకపోతున్నారు. అలాగే వదిలేస్తే తోటమొత్తం తెగుళ్లు వ్యాపిస్తాయని కూలీలతో కాయలు తొలగిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఆగస్టు మొదటి వారం నుంచి టమాట ధరలు కాస్త పెరిగాయి. 30 కిలోల బాక్సు ధర రూ. 800 నుంచి రూ. 1000 వరకు పలుకుతోంది. ముదిగుబ్బ, కదిరి ప్రాంతాల నుంచి అధికంగా మదనపల్లి టమాట మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. తెగుళ్లతో కాయ నాణ్యత తగ్గడంతో మార్కెట్‌లో తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గుతోందని, రానుపోను రవాణా ఖర్చులకు సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు.

**అధిక తేమవల్ల తెగుళ్లు**

వాతావరణంలో అధిక తేమతో ఆకుమచ్చ తెగులు వ్యాపిస్తోంది. లీటరు నీటికి 3 గ్రాముల మాంకోజీబ్ లేదా 3 గ్రాముల క్లోరో తలోనిల్ కలిపి పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆశించకుండా 10 లీటర్ల నీటికి 5 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ లేదా 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందును కలిపి పిచికారి చేయాలి. ఈ మందులను పిచికారి చేసే సమయంలో జిగురు కలిపితే సమర్థవంతంగా తెగుళ్లను నివారించవచ్చు. ■

స్నేహ గుణం ఎంతగా నీ బలహీనత అయితే అంతగా నిన్ను మించిన బలశాలి వుండడు

# గుర్రాలపై కాపుకాస్తున్న మహిళా శక్తి !

**అ**శ్వాన్ని అధిరోహించి...గస్తీ కాయాలంటే మగ పోలీసు లేనా..? మేమూ తక్కువేం కాదంటున్నారు మహిళా కానిస్టేబుళ్లు. గుర్రపుస్వారీలో శిక్షణ పొంది...మెరికల్లా తయారై 'సిటీ మౌంటెడ్ పోలీస్ విభాగం'లో భాగంఅయ్యారు. అశ్వదళంలో తెలంగాణా రాష్ట్రంలోనే మొట్ట మొదటి మహిళా బృందంగా చరిత్ర సృష్టించారు. అసమానతలను దాటి... అవమానాలను భరించి..అనుకున్నది సాధించిన ఈ పది మంది మౌంటెడ్ పోలీస్ మహిళా టీమ్‌పై ఆంధ్రజ్యోతి 'నవ్య' ప్రత్యేక కథనం అందించింది. ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ఆ విశేషాలు మహిళా సాధికారత పాఠకుల కోసం ...



**'చీపుర్లు అమ్ముకోక చదువెందుకు' అన్నారు...**

నాపేరు ఎం. రేణుక. మాది హైదరాబాద్. అమ్మా నాన్నలు భీమా, వెంకటేష్... చీపుర్లు అమ్ముతూ మమ్మల్ని పోషించేవారు. మేం చదువుకొంటామంటే... 'చీపుర్లు అమ్ముకునేవాళ్లకు చదువెందుకు' అని కొంతమంది హేళన చేశారు. దాంతో మా మామయ్య భగవాన్ నన్ను, అక్కను చేరదీశాడు. ఇద్దరినీ కష్టపడి చదివించాడు. అక్క ఎంబీబీఎస్ చదివి డెంటిస్టు అయ్యింది. ఎంబీఏ చదివిన నేను బ్యాంకు ఉద్యోగం చేయాలనుకున్నాను. అనుకోకుండా కానిస్టేబుల్ ఉద్యోగానికి అప్లై చేశాను. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. పోలీస్ ఉద్యోగం వచ్చిందని తెలియగానే ఆ రోజు చదువు వద్దన్నవారి నోళ్లు మూతపడ్డాయి.

**పోలీసులంటే ఇంత భయమా అనిపించేది...**

నా పేరు టి.సుభద్ర. మాది కడప. అమ్మానాన్నలు ఓబుల్‌రెడ్డి, మహాలక్ష్మి. వ్యవసాయం చేస్తారు. మేం ముగ్గురం అమ్మాయిలం... ఒక అన్నయ్య. నాన్న వ్యవసాయం చేస్తూనే మమ్మల్ని చదివించారు. నేను బీపీఈడీ చేశాను. మాది రాయలసీమ. నాన్న ఎప్పుడూ ఏదో ఒక గొడవలో పోలీస్ స్టేషన్‌లకు వెళ్లాల్సి వచ్చేది. స్టేషన్‌కు వెళ్లినప్పుడు పోలీసులకు ఇచ్చే గౌరవం, వాళ్లు ఊళ్లోకి వస్తున్నారంటే భయపడి ఎక్కడి వాళ్లు అక్కడ గప్‌చుప్‌గా ఉండటం గమనించాను.

అప్పుడు అనిపించేది..'పోలీసులు అంటే ఇంత భయపడతారా' అని. అందుకే నేను పోలీస్ అయి మా నాన్నకు ఇబ్బందులు లేకుండా చూడాలని అనుకునేదాన్ని. మొదటి నుంచీ ఆటల్లో చురుగ్గా ఉండేదాన్ని. తైక్వాండో నేర్చు కున్నాను. ఇంటర్‌లో ఉన్నప్పుడు హరియాణాలో జరిగిన 'ఆలిండియా అండర్–16 తైక్వాండో' పోటీల్లో పాల్గొన్నాను. డిగ్రీ అయిపోగానే తెలంగాణలో వచ్చిన నోటిఫికేషన్ చూసి అప్లై చేశాను.

**ఏం సాధించాం అనేదే ముఖ్యం...**

నా పేరు జి.అఖిలాయాదవ్. నాన్న హెడ్ కానిస్టేబుల్. చిన్నప్పటి నుంచి నాన్న ఉద్యోగాన్ని గమనిస్తున్నాను. నేను పీజీ డిప్లమా ఇన్ క్లినికల్ న్యూట్రిషన్ చేశాను. మెడికల్ ఫీల్డ్ వైపు వెళ్దామనుకున్నా. కానీ నాన్న పోలీస్ డిపార్టుమెంట్ వైపు ప్రయత్నించమన్నారు. నాన్న ఆధ్వర్యంలోనే శిక్షణ తీసుకున్నా. మొదటి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ ఉద్యోగం



సాధించాను.

**నాన్న చెప్పారు... చదువు ఆపద్దని...**

నా పేరు మర్రి హవంతిక. మేం ముగ్గురు సంతానం. నాన్న రవీందర్ ఆటోడ్రైవర్. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు అమ్మ గుండెపోటుతో చనిపోయింది. చెల్లి, తమ్ముడు, నాన్న ఇబ్బంది పడతారని చదువు మానేద్దాం అనుకున్నా. కానీ నాన్న ఒప్పుకోలేదు. 'అమ్మ లేదని చదువు మానొద్దు. ఆ చదువే రేపటి నీ భవిష్యత్తు' అని చెప్పారు. నాన్న ఆటో నడిపి కష్టపడి మా ముగ్గురినీ చదివించారు. నేను గురుకులాల్లో చదివి బీకాం పూర్తి చేశాను. చెల్లి బీటెక్, తమ్ముడు ఇంటర్ చదువుతున్నారు.


**ఫుట్‌బాల్ ఛాంపియన్ అవ్వాలనుకున్నా...**

నా పేరు మోనాలిక. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ చదివాను. నాన్న వేణు... ఫిలిం ఇండస్ట్రీలో కొరియోగ్రాఫర్. నాకు చిన్నప్పటి నుంచీ ఆటలు, యోగా అంటే ఇష్టం. స్కూల్లో ఫుట్‌బాల్ ఛాంపియన్‌ని. 2018లో అండమాన్ నికోబార్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నాను. ఫుట్‌బాల్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనుకున్నా. స్పోర్ట్స్ బ్యాక్ గ్రౌండ్ ఉందికదా అని పోలీస్ ఉద్యోగానికి అప్లై చేశాను. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం వచ్చింది.

**ఇద్దరు పిల్లలు... అయినా...**

నా పేరు బి.అఖిల. మాది హైదరాబాద్‌లోని బోడుప్పల్. నాన్న ఆటోడ్రైవర్. అమ్మ కూలీ పనులు చేస్తుంది. మా ఇళ్లలో 10వ తరగతిలోనే పెళ్లి చేసి పంపిస్తారు. నాకూ అలాగే జరిగింది. నాకు పెళ్లై 13 ఏళ్లు. ఇద్దరు మగపిల్లలు. పెద్దవాడు 7వ తరగతి, చిన్నవాడు 5వ తరగతి చదువుతున్నారు. పెళ్లయిన కొద్ది రోజులకే అత్తారింట్లో నరకం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూశాను.

ఈ నరకం నుంచి బయట పడాలంటే ఇంకా చదువుకొని ఉద్యోగం సాధించాలని అనుకున్నాను. అందుకు భర్త, అత్తామామలు, ఆడపడచు ఒప్పుకోలేదు. అయినా పట్టు విడవకుండా, అమ్మానాన్నల సహకారంతో దూరవిద్యలో బీఏ పూర్తి చేశాను. ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా చేరాను. ఎప్పై ఉద్యోగం వస్తే భర్త, అత్తింటివారికి గట్టి సమాధానం చెప్పాలనుకున్నా. అప్పుడే కానిస్టేబుల్ ఉద్యోగానికి నోటిఫికేషన్ వచ్చింది. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నా. చెంగిచెర్ల గ్రౌండ్‌లో ఫిట్‌నెస్ ప్రాక్టీస్ ప్రారంభించాను. అక్కడ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి సార్ పరిచయం అయ్యారు. ఆయన ఈవెంట్స్‌కు సంబంధించిన మెళకువలు నేర్పించారు. కోచింగ్ ఇచ్చారు. అమ్మమ్మను వెంట తీసుకెళ్లి తెల్లవారుజామున 4 గంటల నుంచే ప్రాక్టీస్ చేసేదాన్ని. నా కష్టం వృథా పోలేదు. అనుకున్నట్లుగానే ఉద్యోగం సాధించాను. ■



మెచ్చుకునే వారి కంటె విమర్శించే వారి వల్లనే ఎక్కువ మేలు జరుగుతుంది, సామర్థ్యం పెంచుకోవడానికి వారే మూలం

# స్వయం సహాయ సంఘాల్లో ఇక బాలికలు

**కో**టి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రభుత్వం చెబుతున్నది. ఇందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి మిషన్ - 2025లో కింద కోటి మంది మహిళలను స్వయం సహాయక బృందాల్లో చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నది. సంఘాల్లో చేరని మహిళలు, 15-18 సంవత్సరాల బాలికలను సైతం సంఘాల్లో చేర్చుకునేలా ప్రణాళిక రూపొందించింది.

అంతేకాకుండా అరవై ఏళ్లు పైబడిన మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. ఈ సంఘాల ఏర్పాటు, పర్యవేక్షణకు సంబంధించిన మార్గదర్శకాలను ఇటీవల గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) సీఈఓ దివ్య దేవరాజన్ విడుదల చేశారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు. రోజువారీ పురోగతిని ఆన్ లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమానికి డీఆర్డీఓలు, ఏపీఎంలు, సీసీలు మార్గదర్శకత్వం వహించనున్నారు.

**ప్రత్యేక ప్రణాళిక**

ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి సెర్ప్ ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఇంకా సంఘాల్లో చేరని మహిళలు, దివ్యాంగులు, వృద్ధ మహిళలను గ్రామాల్లో గుర్తించాల్సి ఉంటుంది. పింఛన్ దారుల జాబితాలు (ఓఏపీ, పీడబ్ల్యూడీ), ఉపాధి హామీ జాబ్ కార్డులు, గ్రామ పంచాయతీ ఇంటి పన్ను జాబితాలను ఉపయోగించి ఈ జాబితాలను రూపొందించవచ్చు. కొత్త స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడం లేదా అర్హులైన వారిని ఇప్పటికే ఉన్న సంఘాలలో చేర్పించాలి.

అనంతరం, వారి కోసం పొదుపు ఖాతాలను సమీప బ్యాంకుల్లో తెరవాలి. సభ్యుల వివరాలు, స్వయం సహాయక సంఘాల వివరాలను సెర్ప్ పోర్టల్స్‌లో నమోదు చేయాలి. స్వయం సహాయక బృందాల ద్వారా వారికి బ్యాంకు లింకేజీలు, సీఐఎఫ్ రుణాలు, స్త్రీనిధి రుణాలు, సెర్ప్ నుండి రివాల్వింగ్ ఫండ్ వంటి ఆర్థిక సహాయాలు కూడా అందిస్తారు.

**మార్గదర్శకాలు ఇలా..**

ఒక సంఘంలో 10 నుండి 15 మంది సభ్యులు ఉండేలా, ప్రత్యేక పరిస్థితుల్లో ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో కూడా సంఘాలను ఏర్పాటు చేయవచ్చని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు పైబడిన మహిళలు మాత్రమే ఈ సంఘాల్లో చేరడానికి అర్హులని, ప్రస్తుతం మహిళా స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్నవారు అనర్హులని తెలిపారు. పదవీ విరమణ పొందిన వారు సంఘ తీర్మానం ఆధారంగా చేరవచ్చు.

తమ పనులు తాము చేసుకోగలిగేవారు, ఇతరుల సహాయం పాక్షికంగా అవసరమైనవారు సభ్యులుగా ఉండవచ్చని తెలిపారు. పూర్తిగా శారీరక శక్తి కోల్పోయి, అనారోగ్యంతో మంచాన పడినవారు అనర్హులని తెలిపారు. సంఘం పేరు మీద బ్యాంకులో పొదుపు ఖాతా తెరవాలి.

సభ్యులు తమ ఆదాయం ప్రకారం ప్రతినెల పొదుపు చేసుకోవాలి. సభ్యుల అవసరాల కోసం పొదుపు చేసిన డబ్బును బ్యాంకు నుండి విత్‌డ్రా చేసి అంతర్గత రుణాలుగా ఇవ్వాలి. కనీసం 15 రోజులకోసారి తప్పనిసరిగా సమావేశం నిర్వ హించాలి. సంఘం పనితీరు ఆధారంగా గ్రేడింగ్ చేసి, నియమాల ప్రకారం ఆర్ఎఫ్, వీఆర్ఎఫ్ నిధులు అందిస్తారు.

**అధికారుల బాధ్యతలు**

**దివ్యాంగుల కోసం..**

తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పాలసీలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలతో పాటు దివ్యాంగుల కోసం కూడా ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ద్వేషించడం కాక ప్రేమించడం, అనుకరించడం కాక అనుసరించడం, పొగడడం కాక అభినందించడం నేర్చినవాడు వివేకి

# ప్రకృతి సేద్యంచేసే రైతులకు నెలకు రూ. 5 వేలు!

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయడంతో తెలంగాణ రాష్ట్రంలో పథకం అమలుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. జిల్లాల వారీగా క్లస్టర్లను కూడా ఏర్పాటు చేశారు. క్లస్టర్ల వారీగా రెండు నుంచి మూడు గ్రామాలను ఎంపిక చేసి, ఆయా గ్రామాల్లో సుమారుగా 125 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు.

**నెలకు రూ. 5 వేల వేతనం :**

జిల్లాల వారీగా పరిశోధన స్థానాలను కేంద్రంగా గుర్తించి అక్కడి సైంటిస్టులతో స్థానిక రైతులకు శిక్షణ ఇప్పించనున్నారు. రైతులకు సాయంగా ఉండేందుకు వారి నుంచి క్లస్టరుకు ఇద్దరు రైతులను సెలెక్ట్ చేస్తున్నారు. వీరిని కృషి సఖీలు లేదా క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అని వ్యవహరిస్తున్నారు. వీరికి నెలకు రూ.5 వేలు వేతనంగా ఇవ్వాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. వీరికి శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనీ ఒకరు ఉంటారు. ఇప్పటికే ప్రకృతి సేద్యం చేస్తూ ఆదర్శంగా నిలిస్తున్న రైతులను ఎంపిక చేస్తారు.

**జాతీయ బ్రాండ్ కల్పించడం :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకాన్ని అమలు చేయనున్నారు. భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు రసాయన రహిత సేద్యాన్ని ప్రోత్సహించడం, మట్టిలో ఉండే సూక్ష్మజీవుల ప్రాధాన్యాన్ని ఇందులో తెలియజేయనున్నారు. పంట పొలంలో బయో ఇన్‌పుట్‌ల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా సాగు ఖర్చును చాలా మేరకు తగ్గించడం, నేల కార్బన్ కంటెంట్, నీటి వినియోగ సామర్థ్యం, రైతులు పండించిన ఉత్పత్తుల విక్రయానికి సాధారణ ధ్రువీకరణ, మార్కెట్ సౌకర్యం, జాతీయ బ్రాండ్ తదితర వసతులను కల్పించనున్నారు.

**నమూనా క్షేత్రాలు :**

జిల్లాలో ఎంపిక చేసిన పరిశోధన స్థానంలో ఒక మోడల్ క్షేత్రంతో పాటు వీరి ఆధ్వర్యంలో జిల్లాకు రెండు నమూనా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆయా పంటల సాగును ప్రత్యక్షంగా రైతులు పరిశీలించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

**ఆర్థిక సాయం :**

ఎంపిక చేసిన రైతులు ప్రకృతి సేద్యం చేసేందుకు వీలుగా ఎకరానికి రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.

**బయో కేంద్రాలు :**

ప్రకృతి సేద్యం చేసే రైతులకు అవసరమైన బయో ఎరువులు, జీవ రసాయనాలు అందుబాటులో ఉండేందుకు వీలుగా ఒక్కో క్లస్టరుకు మూడు చొప్పున బయో కేంద్రాలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేస్తోంది. ఒక్కో కేంద్రానికి రూ. లక్ష ప్రభుత్వం అందించనుంది. వీటిని రైతు ఉత్పత్తి దారుల సంఘాలు, సహకార సంఘాలు ఏర్పాటు చేసు కునేలా తొలి ప్రాధాన్యత ఇస్తారు. దీంతో రసాయనాల వాడకం తగ్గి భూసారం ఆరోగ్యకరమైన రీతిలో ఉంటుంది. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

(ఈ టీవి భారత్ సౌజన్యంతో)

■

---

రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడమే దీని లక్ష్యం.

ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ఆర్థికంగా, సామాజికంగా చేయూత అందించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇప్పటికే రాష్ట్రంలో 44,478 మంది దివ్యాంగులు 6,147 సంఘాలుగా ఏర్పడి ఉన్నారు. ఇప్పటికే ఉన్న సంఘాలను పునరుద్ధరించడం, బలోపేతం చేయడం కూడా ఈ కార్యక్రమంలో భాగంగా జరుగుతుంది.

■

దూరం అనుబంధానికి అడ్డంకి కాదు, దగ్గరితనంతో స్నేహం పెరగదు ; ఆప్యాయత ఆత్మీయత వుంటే ఎక్కడున్నా అనుబంధమే

# రాయితీపై వ్యవసాయ పరికరాలను ఇలా పొందండి

**వ్య**వసాయ యాంత్రీకరణ పథకంలో (ఫామ్ మెకనైజేషన్ స్కీమ్) రైతులకు వ్యక్తిగతంగా యంత్ర పరికరాలను రాయితీపై అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పవర్ టిల్లర్ మొదలు ట్రాక్టర్‌తో అనుసంధానించి వినియోగించే పలు పరికరాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. రాయితీ పోను మిగతా మొత్తం రైతు చెల్లిస్తే సరిపోతుంది. పవర్ టిల్లర్, పవర్ వీడర్, కట్టర్లకు రైతుల నుంచి మంచి డిమాండు ఉంది. వీటికోసం మంజూరైన వాటికంటే అప్లికేషన్లు ఎక్కువగా వచ్చాయి.



**పవర్ స్ప్రేయర్‌పై రూ.8,000 రాయితీ :** స్ప్రేయర్ ధర రూ.2,500 నుంచి రూ.4,000 వరకు ఉండగా ప్రభుత్వం రూ.1,000 రాయితీగా ఇస్తోంది. పవర్ స్ప్రేయర్ ధర రూ.20,000 నుంచి రూ.22,000 వరకు ఉండగా రాయితీ రూ.8,000. ట్రాక్టర్‌కు అమర్చే పరికరాలు రూ.1.4 లక్షల నుంచి రూ.1.5 లక్షలు ఉండగా, వీటిపై రాయితీగా రూ.46,000 నుంచి రూ.50,000 వరకు ఇస్తోంది.

**టిల్లర్‌పై లక్ష రూపాయల వరకూ రాయితీ :** రోటావీటర్ ధర రూ.1 లక్ష నుంచి రూ.1.5 లక్షలు ఉండగా, ప్రభుత్వం రూ.50,000 రాయితీ ఇస్తోంది. పవర్ వీడర్ ధర రూ.35,000 నుంచి రూ.87,000 వరకు ఉండగా, ప్రభుత్వ రాయితీ 50%గా ఉంది. కట్టర్ ధర రూ.72,000 ఉండగా దీనికి ప్రభుత్వ రాయితీ రూ.36,000, పవర్ టిల్లర్ ధర 3 లక్షలు ఉండగా, రాయితీ లక్ష రూపాయల వరకూ ప్రభుత్వం ఇస్తోంది.

**రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు :** 5 ఎకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు, మహిళ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ■

## వ్యవసాయ ప్రయోగశాలలకు ఎన్ఏబీఎల్ గుర్తింపు

**క**ర్నూలులోని పురుగు మందుల పరీక్షా కేంద్రం, బాపట్లలోని ఎరువుల నియంత్రణ ప్రయోగశాల, నెల్లూరులోని జీవ, సేంద్రియ ఎరువుల నాణ్యత, నియంత్రణ ప్రయోగశాలకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) సంస్థ గుర్తింపు లభించింది.

ఈ ప్రయోగశాలలు తమ సాంకేతిక నైపుణ్యం, గ్లోబల్ ప్రమాణాలతో నాణ్యత పరీక్షల సామర్థ్యాన్ని నిరూపించడంతో అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఎన్ఏబీఎల్ గుర్తింపు లభించినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు శుక్రవారం తెలిపారు. దీని ద్వారా వ్యవసాయ వనరుల నాణ్యతపై రైతుల్లో మరింత నమ్మకం పెరుగుతుందన్నారు.

అలాగే, రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ ప్రయోగశాలలనూ దశల వారీగా ఎన్ఏబీఎల్ గుర్తింపు పరిధిలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ■


## మీకు తెలుసా ?

గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - మొత్తంగా పంట దిగుబడులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...



వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...

ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ... ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!

## మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

## వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HCD/1064/2024-26
*Publication Date: 01-09-2025* Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 *Posting Date: 05/06-09-2025*








స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు : హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో ... మర్యాదరామన్నపట్నం ఎఫ్ పి సి లో ...



నందికొట్కూరు శ్రీ భ్రమరాంబిక ఎఫ్ పి ఓ వార్షిక మహాసభ దృశ్యం





గుర్రంకొండ ఎఫ్ పి సి తృతీయ వార్షిక మహాసభ దృశ్యం ... రాయలచెరువు ఎఫ్ పి సి ని సందర్శించిన శ్రీ సి ఎస్ రెడ్డి

To ADDRESS



గోరంట్లపల్లి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన
అరబిందో ఫార్మా ఎం డి శ్రీ నిత్యానంద రెడ్డి

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని,
తానీషానగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089